అమల్లోకి ఉచిత ఇసుక...

తొలిరోజు అనుమతుల గందరగోళం

ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఆచరణలోకి తీసుకొచ్చింది. సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చింది. అయితే జిల్లాలో తొలిరోజు అనుమతుల పేరిట గందరగోళం నెలకొంది. మొత్తం ఐదు స్టాక్ పాయింట్లు వుండగా సోమవారం వెంకటగిరి మండలం మొగళ్ళగుంట స్టాక్ పాయింట్‌లో మాత్రమే ఇసుక పంపిణీ మొదలైంది. దొరవారి సత్రం, నాగలాపురం, పిచ్చాటూరు మండలాల్లోని మిగిలిన నాలుగు స్టాక్ పాయింట్లలో అనుమతులకు సంబంధించిన అభ్యంతరాలతో ఇసుక పంపిణీ నేటికి వాయిదా పడింది.

- ఆంధ్రజ్యోతి,తిరుపతి



వెంకటగిరిలో మొదలైన ఇసుక పంపిణీ

వెంకటగిరి మండలం మొగళ్ళగుంట స్టాక్ పాయింట్‌లో ఇసుక పంపిణీ ప్రారంభమైంది. తొలిరోజు కావడంతో స్వయంగా తహసిల్దారే వచ్చి పంపిణీని పర్యవేక్షించారు. వేకువజాము నుంచే ట్రాక్టర్లు, టిప్పర్లు స్టాక్ పాయింట్ వద్ద బారులు తీరాయి. స్టాక్ పాయింట్ నిర్వహణ వ్యయం, జీఎస్టీ వంటివి కలుపుకుని టన్నుకు రూ. 590 చొప్పున చెల్లింపుతో ఇసుక కేటాయింపులు మొదలు పెట్టారు. ట్రాక్టరుకు గరిష్ఠంగా వెయ్యి రూపాయలు, టిప్పర్‌కు గరిష్ఠంగా 2 వేలు చొప్పున రవాణా ఖర్చు భరించాల్సి వస్తోంది. ఇవన్నీ కలిపినా ట్రాక్టర్ లోడు గరిష్ఠంగా రూ. 4 వేలు, టిప్పర్ లోడు గరిష్ఠంగా రూ. 14 వేలు మించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ లోడుకు రూ. 5500 కాగా టిప్పర్ లోడుకు రూ. 20 వేలు చొప్పున చెల్లించాల్సి వుండేది. ఇపుడు ట్రాక్టర్ లోడుపై రూ. 1500, టిప్పర్ లోడుపై రూ. 6 వేలు చొప్పున ఆదా అవుతోంది. దీంతో ఇసుక అవసరమైన వారు, సామాన్య జనం కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ స్టాక్ పాయింట్‌లో 900 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు మాత్రమే వున్నాయి. స్వల్ప వ్యవధిలోనే నిల్వలు ఖాళీ కానున్నాయి. తర్వాత స్టాక్ పాయింట్ ఇక్కడే కొనసాగుతుందా లేక మరో చోటకు మారుస్తారా అన్న దానిపై స్పష్టత రాలేదు.

మిగిలిన చోట్ల నేటినుంచి పంపిణీ

దొరవారిసత్రం మండలం మావిళ్ళపాడు స్టాక్ పాయింట్ వద్ద 21,400 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు వున్నాయి. ఇక్కడ టన్ను ధర రూ. 465గా నిర్ణయించారు. సోమవారం ఉదయం 7 గంటలకు ముందే ట్రాక్టర్లు, టిప్పర్లు వరుసలో నిలుచున్నాయి. ప్రభుత్వం నుంచీ అనుమతులు రాలేదని చెబుతూ అధికారులు ఇసుక కేటాయింపులు ప్రారంభించలేదు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత అనుమతులు వచ్చాయని, ఎమ్మెల్యే వచ్చి ప్రారంభిస్తారని చెప్పారు. అయితే 5 గంటల సమయంలో పై అధికారుల నుంచీ వచ్చిన ఆదేశాల మేరకు మంగళవారం నుంచీ పంపిణీ ప్రారంభిస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో రోజంతా పడిగాపులు కాచిన ఇసుక వినియోగదారులు, ట్రాక్టర్, టిప్పర్ ఆపరేటర్లు ఉసూరుమంటూ వెనుదిరిగారు. నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ వద్ద రెండు ఇసుక పాయింట్లు వుండగా వేకువ జామునుంచే వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లు బారులు తీరాయి. ఉదయం 7 గంటలకు ఇసుక పంపిణీ ప్రారంభించి రెండు ట్రాక్టర్లకు ఇసుక కూడా నింపారు. అయితే అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ప్రభుత్వం నుంచీ అనుమతులు రాలేదని, అవి వచ్చేవరకూ ఇసుక కేటాయింపులు జరపవద్దంటూ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు హడావిడిగా ట్రాక్టర్ ట్రాలీల నుంచీ ఇసుకను అన్ లోడ్ చేయించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆదిమూలం స్టాక్ పాయింట్‌ను సందర్శించి వెళ్లారు. ప్రభుత్వం నుంచీ అనుమతులు రావడం ఆలస్యమవుతోందని, మంగళవారం నుంచీ ఇసుక పంపిణీ ప్రారంభిస్తామని అధికారులు చెప్పడంతో రోజంతా నిరీక్షించిన కొనుగోలుదారులు, వాహనాల ఆపరేటర్లు తిరుగుముఖం పట్టారు. పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు స్టాక్ పాయింట్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అనుమతులు రాలేదంటూ స్టాక్ పాయింట్ ప్రారంభాన్ని మంగళవారానికి వాయిదా వేశారు.



మొగళ్ళగుంటలో టిప్పర్‌లోకి ఇసుక లోడింగ్

ఇసుక కేటాయింపు పత్రం

తగ్గనున్న నిర్మాణ వ్యయం



సాధారణ ఇంటి నిర్మాణానికి 30 టన్నుల ఇసుక అవసరమవుతుంది. గత ప్రభుత్వంలో 30 టన్నుల ఇసుక కోసం రూ. 33 వేలు చెల్లించాల్సి వచ్చేది. ఇపుడు అదే ఇసుక రూ. 24 వేలకే అందుబాటులోకి వస్తోంది. అంటే సగటు వ్యక్తికి ఇంటి నిర్మాణ వ్యయం ఇసుకపై రూ. 9 వేలు తగ్గుతోంది. మునుపటితో పోలిస్తే ఇపుడు ట్రాక్టర్ లోడుపై రూ. 1500 తగ్గింది. అదే విధంగా టిప్పర్ లోడు కూడా గతానికంటే రూ. 6 వేలు తగ్గింది. నిర్మాణాలు చేపట్టే వారికి కొత్త ప్రభుత్వంలో ఇది ఖచ్చితంగా శుభవార్తే.

- అభిషేక్, వెంకటగిరి



మావిళ్ళపాడు స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం బారులు తీరిన ట్రాక్టర్లు, టిప్పర్లు

ఎన్ఆర్ఐ కిడ్నాప్

● నగలు, నగదు లాక్కుని వదిలిపెట్టిన వైనం

శ్రీకాళహస్తి, జూలై 8: విదేశాల్లో చాలా కాలం ఉద్యోగం చేసి తిరుపతిలో స్థిరపడేందుకు సిద్ధమైన ఓ ఎన్ఆర్ఐను కొందరు కిడ్నాప్ చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది.తిరుపతికి చెందిన కృష్ణమూర్తి(65) సుదీర్ఘకాలం వివిధ దేశాల్లో ఉద్యోగాలు చేశాడు. ఇటీవల సొంతూరు తిరుపతికి వచ్చి చైన్‌లింక్ వ్యాపారం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఓ సెల్‌ఫోన్ దుకాణంలో పనిచేసే యువతి(26)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య బాగా చనువు పెరిగింది. గతంలో ఎర్రచందనం కేసులో నిందితుడిగా వుండిన ఆ యువతి భర్త ఎలాగైనా కృష్ణమూర్తిని దోపిడీ చేయాలని పథకం పన్నాడు. ఈ క్రమంలో తనతో పాటు ఎర్రచందనం కేసులో నిందితుడైన మరో యువకుడిని సహాయంగా ఎంచుకున్నాడు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌లో కొందరు సభ్యులు చైన్‌లింక్ వ్యాపారంలో చేరుతారని కృష్ణమూర్తిని నమ్మించారు.ఈనెల 3వ తేదీ కారులో అందరూ రాజీవ్‌నగర్‌కు చేరుకున్నారు. ఇక్కడ యువతి భర్త ముందుగా వేసుకున్న పథకం ప్రకారం కృష్ణమూర్తి సెల్‌ఫోన్ లాక్కుని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాడు. అక్కడినుంచి మరో ఇద్దరి సాయంతో కేవీబీ పురం మండలం పెరిందేశానికి తరలించారు. కృష్ణమూర్తి వద్ద ఉన్న కొంత నగదుతో పాటు బంగారు ఆభరణాలను లాక్కున్నారు. అలాగే బ్యాంకు ఖాతాలోని రూ.3లక్షల నగదును ఏటీఎం, ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా స్వాహా చేశారు. ఆ తరువాత కృష్ణమూర్తి భార్యకు ఫోన్‌చేసి రూ.కోటి డిమాండ్ చేశారు. 4వ తేదీ పెరిందేశం నుంచి కారులో కృష్ణమూర్తిని ఎక్కించుకుని శ్రీకాళహస్తి మండలంలోని పల్లెల మీదగా సంచరించారు. అతని నుంచి డబ్బులు రావని నిర్ధారించుకున్న తరువాత రాజీవ్‌నగర్‌లో వదలిపెట్టి పరారయ్యారు. రెండు రోజుల పాటు దుండగుల మధ్య నలిగి గాయపడిన కృష్ణమూర్తి నేరుగా తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరాడు.కోలుకున్నాక సోమవారం రాత్రి శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని కిడ్నాప్ ఘటనపై ఫిర్యాదు చేశాడు. దీంతో కిడ్నాప్‌కు పాల్పడిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

టీటీడీ గదులు హైజాక్!

రూ.100 వసతి గది.. రూ.వెయ్యికి విక్రయం

గదులు దొరకని భక్తులే టార్గెట్

ఉత్తరాది నుంచి వచ్చిన దళారుల దందా ఇది

టీటీడీ విచారణలో నివ్వెరపోయే అంశాలు

నాటి వైసీపీ పాలనా వైఫల్యంతోనే ఈ దుస్థితి

తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులే వారి టార్గెట్. దర్శన సమయం వచ్చే వరకు నిరీక్షించడానికి వసతి అవసరం కనుక అలాంటి వారినే ఎరవేస్తారు!. టీటీడీ వంద, 50 రూపాయలకు అద్దె కిచ్చే గదిని ముందుగానే బుక్ చేసుకుని హైజాక్ చేసి, గదులు దొరకని భక్తులకు అప్పటికప్పుడు రూ.వెయ్యి రూపాయలకు అంటగడతారు. డిమాండ్‌ను బట్టి అంతకుమించి వసూలు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనావైఫల్యం పుణ్యమాని పవిత్ర పుణ్యక్షేత్రంలో రోజూ కొందరు ఉత్తరాది నుంచి వచ్చిన దళారుల దందా ఇది. తిరుమలలో గదుల దళారులను అరికట్టేందుకు పోలీస్, విజిలెన్స్ అధికారులు చేపట్టిన విచారణలో ఇలా నివ్వెరపోయే అంశాలు బయటపడుతున్నాయి. మార్ఫింగ్ ఆధార్ కార్డు జిరాక్స్‌లతో గదులను పొంది బ్లాక్‌లో విక్రయించేందుకు నార్త్ ఇండియా నుంచి కొందరు తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో తిష్ట వేయడం ఆశ్చర్యపరుస్తోంది.

● అక్రమార్జనకు దందా సాగించేదిలా!

ఆధార్ కార్డులో ఫొటో మార్ఫిడి చేసి గదులను బుక్ చేసుకోవడం ద్వారా అక్రమాలకు పాల్పడుతున్న వైనం మూడురోజుల క్రితం వెలుగు చూసిన విషయం తెలిసిందే. తొలుత సమీప బంధువు ఆధార్ కార్డుతో గదిని పొంది, ఆ తర్వాత గది కోసం నిరీక్షించే భక్తుడికి బ్లాక్‌లో రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు విక్రయించడం, విక్రయించే క్రమంలోనే ఆ భక్తుడి నుంచి ఆధార్ తీసుకోవడం, తిరిగి భక్తుడి నుంచి పొందిన ఆధార్ జిరాక్స్‌లోని ఫొటోను మార్చి దళారీ ఫొటో జతచేసి తిరిగి గదిని పొందే పెద్ద స్కాంను భద్రతాధికారులు గుర్తించారు. నవకిశోర్ అనే దళారిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఇదే తరహాలో 25 నుంచి 30 మంది దళారులు గదుల ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నట్లు తేలింది. కేవలం గదుల ద్వారా అక్రమాలకు పాల్పడేందుకే మహారాష్ట్ర నుంచి కొంత మంది కుటుంబాలతో వచ్చి తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో గదులకు అద్దెకు తీసుకుని నివాసముంటున్నట్లు కూడా తేలింది. తెలంగాణ, కర్ణాటకల నుంచి కూడా మరికొంతమంది తిరుపతికి వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకున్నట్టు తెలిసింది. ఉదయం భక్తుల్లా తిరుమలకు వచ్చి గదుల ద్వారా వచ్చే సొమ్మును జేబులో వేసుకుని తిరిగి కొండ దిగేస్తున్నట్టు విచారణలో తేలింది. దీన్నిబట్టి గదులను బ్లాక్‌లో విక్రయించడం ద్వారా ఏ స్థాయిలో సంపాదన ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒక్కొక్కరు కనీసం రూ.60వేల నుంచి లక్ష వరకు అక్రమంగా సంపాదిస్తుండగా.. సమయానికి గదులు దొరక్క భక్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనా వైఫల్యం వల్లే తిరుమలలో ఇలాంటి దుస్థితి నెలకొందని, కూటమి సర్కారు ప్రక్షాళన చేపట్టి ఇలాంటి అక్రమాలను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.



ఏళ్లయినా కదలరు!

పోలీసు శాఖలో తిష్టవేసిన సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), జూలై 8 : జిల్లా పోలీసు శాఖలో అధికారులు మారిపోతున్నారు కానీ కింది స్థాయి సిబ్బందికి మాత్రం స్థానచలనం వుండడం లేదు.ఎస్ఐల నుంచి కానిస్టేబుళ్ల వరకు ఎక్కడి వారక్కడే ఏళ్ల తరబడి వుండిపోతుండడం వల్ల పైఅధికారులను తమకున్న స్థానిక సీనియారిటీతో తొందరగా గ్రిప్‌లోకి తెచ్చుకోగలుగు తున్నారు. పోలీసు శాఖలో కొన్నేళ్లుగా బదిలీలు చేపట్టలేదు.రాజకీయ ఒత్తిళ్ళతో కొంతమంది అనుకూల ప్రాంతాలకు బదిలీ చేసుకున్నారు తప్ప మిగిలిన వారందరూ ఐదేళ్ళకు పైబడి ఒకేచోటే వున్నారు.తిరుమలలో ఇద్దరు ఏఎస్ఐలు ఉన్నతాధికారుల పేరు చెప్పుకుని శ్రీవారి దర్శనాల పేరుతో ఏడేళ్ళుగా ఒకే స్టేషన్‌లో పనిచేస్తున్నారు. వన్‌టౌన్, టూ టౌన్ స్టేషన్లలో హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు చాలామంది పదేళ్ళుగా వన్‌టౌన్ నుంచి టూటౌన్‌కు, అక్కడినుంచి వన్‌టౌన్‌కు, లూప్‌లైన్ పేరుతో క్రైం, ట్రాఫిక్ స్టేషన్లకు బదిలీ చేయించుకుని కొండపైనే తిష్ట వేశారు.తిరుమల క్రైం స్టేషన్‌లో ఏఎస్ఐ కొండ వదలడమే లేదు.ట్రాఫిక్‌లోనూ కొందరి పరిస్థితి అలాగే వుంది. ఇక తిరుపతి విషయానికి వస్తే పోలీసు అధికారుల సంఘం నాయకులు నగరాన్ని వదలి బయట పనిచేసిన సందర్భాలే లేవంటే అతిశయోక్తి కాదు. తిరుపతి ఈస్ట్‌లో కొంతమంది కానిస్టేబుళ్ళు ఇక్కడే పనిచేస్తూ ఏకంగా అధికారులను శాసించేస్థాయికి ఎదిగారు.ఎంఆర్‌పల్లి స్టేషన్‌లో సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు అందరూ కొత్తగా వచ్చిన వారు కావడంతో ఇక్కడే చాలాకాలంగా వున్న హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్లదే పైచేయిగా వుందని చెబుతున్నారు. చంద్రగిరి స్టేషన్‌లోనూ ఇద్దరు కానిస్టేబుళ్ళు ఏడేళ్లుగా అక్కడే పనిచేస్తున్నారు. విద్య, వైద్య కేంద్రంగా భాసిల్లుతున్న తిరుపతిలో సెటిలైతే బాగుంటుందన్న ఉద్దేశంతో అధికారులు మొదలు, కిందిస్థాయి సిబ్బంది వరకు ఇక్కడే స్టేషన్ మార్చి స్టేషనుకు బదిలీ చేసుకుంటున్నారు.లేకుంటే సీఐడీ, విజిలెన్సు, ట్రాన్స్‌కో, ఎస్బీ, డీసీఆర్‌బీల్లో పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు.వీరిలో చాలామంది లోకల్‌గా తమకున్న సీనియారిటీతో అధికారులను గ్రిప్‌లోకి తెచ్చుకుని వసూళ్లరాయుళ్లుగా మారిపోతుండడమే విషాదం.ఏళ్ళ తరబడి తిష్ట వేసి కూర్చున్న పోలీసులకు ఎస్పీ హర్షవర్ధన రాజు అయినా స్థాన భ్రంశం కల్పిస్తారా అనేది చూడాల్సివుంది.



హడలెత్తించిన జెర్రిపోతు

తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శిలాతోరణం వద్ద సోమవారం ఓ జెర్రిపోతు భక్తులను హడలెత్తించింది. సుమారు ఏడడుగుల పొడవైన జెర్రిపోతు సోమవారం మధ్యాహ్నం ఎలుకను తరుముతూ శిలాతోరణం ముందుకొచ్చింది. పామును గమనించిన భక్తులు పరుగులు తీశారు. సమీపంలోని భద్రతా సిబ్బంది పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర నాయుడికి సమాచారమిచ్చారు. వెంటనే ఆయన అక్కడికి చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

అది కార్పొరేషన్ నిధులతో వేసిన రోడ్డే

మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఇంటిముందు రహదారి వివాదంపై నివేదిక సిద్ధం

తిరుపతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ నిధులతో 18వ డివిజన్ పరిధిలోని మారుతీనగర్- రాయల్ నగర్ ప్రాంతాలను కలుపుతూ వేసిన రోడ్డు కార్పొరేషన్ నిధులతో వేసిందేనని మున్సిపల్ అధికారులు నివేదిక సిద్ధం చేసినట్టు తెలిసింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తన ఇంటి ముందు కార్పొరేషన్ వేసిన రోడ్లకు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకుండా రెండు వైపులా పెద్ద గేట్లు ఏర్పాటు చేయడంపై వివాదం రేగిన విషయం తెలిసిందే. దీనిపై జనసేన తరపున నాలుగు రోజుల ముందు పెద్దిరెడ్డి ఇంటిముందు ధర్నాకు దిగిన నేపథ్యంలో రోడ్డు వివాదంపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివేదిక కోరారు. మారుతీనగర్-రాయల్ నగర్ కలిపేందుకు సీసీ రోడ్డు వేస్తున్నట్టు రూ.9.55లక్షల అంచనాతో (ఐఎఫ్‌బి నెం45/19-20) ఒకటి, రూ.9.50లక్షలతో (ఐఎఫ్‌బి నెం.46/19-20)లతో మరొకటి రెండు విడతలుగా నామినేషన్‌పై టెండరిచ్చినట్టు గుర్తించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రాయల్‌నగర్ నుంచి మారుతీ నగర్‌ను కలుపుతూ రోడ్డు వేస్తున్నట్టు కార్పొరేషన్ రికార్డులో నమోదుచేసిన విషయాన్ని కూడా నిర్ధారించారు. అయితే అది తన స్థలమేనని పెద్దిరెడ్డి కోర్టును ఆశ్రయించినట్టు తెలుస్తోంది.

అందరికీ 'ఎనీవేర్' కుదరదు!

చేయి తడిపితేనే పనవుతుంది

రిజిస్ట్రేషన్ శాఖపై విమర్శల వెల్లువ

తిరుపతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : 'ఎనీవేర్' రిజిస్ట్రేషన్ కింద రాష్ట్రవ్యాప్తంగా తమకు ఇష్టమైన ప్రాంతంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములు, ప్లాట్లు, ఇళ్లు ఇతర ఆస్తులు క్రయ, విక్రయంతోపాటు అడుమానం ఇతర సేవలు పొందే అవకాశం ఉంది. కానీ జిల్లాకొచ్చేసరికి ఈ సౌకర్యాన్ని అందరూ ఉపయోగించుకోవడం కుదరదు. చేయి తడిపితే పనవుతుందని.. రిజిస్ట్రేషన్ శాఖపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్లు సిండికేట్‌గా మారడం వల్లే ఇలా జరుగుతోందన్న ఆరోపణలూ లేకపోలేదు.ఇటీవల జరిగిన సంఘటనే దీనికి నిదర్శనం. పిచ్చాటూరుకు చెందిన ఓ వ్యక్తి ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌ను కలిశారు. అక్కడ తిప్పించుకోవడంతో ఎనీవేర్ సౌకర్యం ద్వారా తిరుపతి సబ్ రిజిస్ట్రార్‌ను కలిశారు. అన్ని పత్రాలు పరిశీలించిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సదరు రిజిస్ట్రేషన్ చేయడం కుదరదని సహేతుకమైన కారణం చెప్పకుండానే తిరస్కరించారు. పైగా ఈ పని అవ్వాలి అంటే ఓ సారి పిచ్చాటూరు సబ్ రిజిస్ట్రార్‌ను కలవమని సలహా ఇచ్చారు. ఇక చేసేది లేక మళ్లీ ఆ వ్యక్తి పిచ్చాటూరు సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లారు. అయినా పనికాకపోవడంతో దళారులను ఆశ్రయించి.. అడిగింది ముట్టచెప్పి పని చేయించుకోవాల్సి వచ్చింది.

నిబంధనలు ఇవీ..

ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఆస్తి నిషేధిత జాబితాలో ఉన్నా.. ఏవైనా ఇతర అభ్యంతరాలున్నా తిరస్కరించవచ్చు. తిరస్కరణకు గల కారణం కూడా రాత పూర్వకంగా ఇవ్వాలి.

సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు శూన్యం

సబ్ రిజిస్ట్రార్లపై ఈ విషయంలో ఎవరైనా పైఅధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా రిజిస్ట్రేషన్ శాఖ తయారవడమే దీనికి కారణమన్న విమర్శలున్నాయి. కొత్త ప్రభుత్వమైనా ఈ సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఇలా ఉంటే ఎలా తాగాలి గోవిందా..!



రాంభగీచ జలప్రసాద కేంద్రం వద్ద వ్యర్థాలు - మంచి నీరు పట్టుకుంటున్న భక్తుడు

తిరుమలలోని జలప్రసాద కేంద్రాల (ఆర్వోప్లాంట్స్) వద్ద పారిశుధ్య లోపం స్పష్టంగా దర్శనమిస్తోంది. తిరుమలలో ప్లాస్టిక్‌ను నిషేధించినప్పటి నుంచి శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులందరూ తిరుమలలోని పలుప్రాంతాల్లో ఉండే జలప్రసాద కేంద్రాలపైనే ఆధారపడుతున్న విషయం తెలిసిందే. కొన్ని ప్రదేశాల్లోని జలప్రసాదాల కేంద్రాల వద్ద అపరిశుభ్రత కనిపిస్తోంది. అన్నం మెతుకులు, సోపులు, ఉమ్మిల వంటి వ్యర్థాలతో తాగు నీటి కేంద్రాలు అస్తవ్యస్థంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రాంభగీచ బస్టాండ్ వద్దనున్న జలప్రసాదమైతే దారుణంగా మారింది. పక్కనే అన్నప్రసాదాల వితరణ కేంద్రం ఉండటంతో అన్నప్రసాదాలు స్వీకరించిన భక్తులు చేతులు కడగటం, అందులోనే అన్నప్రసాదాలను పడివేయడంతో ఈ కేంద్రం నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. ఈప్రాంతంలో పారిశుధ్య పనులు చేపట్టకపోడటంతో నీరు ఎలా తాగాలంటూ భక్తులు వాపోతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రేపటినుంచి కల్యాణ వెంకన్న సాక్షాత్కార వైభవోత్సవాలు

చంద్రగిరి, జూలై 8: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి సాక్షాత్కార వైభవోత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లు బుధవారం పెద్ద శేష వాహనంపై, గురువారం హనుమంతు వాహనంపై, శుక్రవారం శ్రీవారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో తిరుప్పావడసేవ, ఆర్జిత కల్యాణోత్సవం సేవను టీటీడీ రద్దు చేసింది.

తిరుమలేశుడి సేవలో కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి





ఆలయంలో విద్యాప్రసన్నతీర్థ స్వామి - రమేష్ తవడ్కర్ - యరపతినేని శ్రీనివాసరావు



తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి విద్యాప్రసన్న తీర్థస్వామి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో మహద్వారం వద్దకు చేరుకున్న విద్యాప్రసన్నకు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శిష్యబృందంతో ఆలయంలోకి వెళ్లిన విద్యాప్రసన్న ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అదేవిధంగా శ్రీవారిని గోవా స్పీకర్ రమేష్ తవడ్కర్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

వైద్యులకు, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించండి



చంద్రగిరి సీహెచ్‌సీ ఆస్పత్రి ముందు నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

చంద్రగిరి, జూలై 8: ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని చంద్రగిరి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ పేర్కొన్నారు. తిరుపతి రుయా హెడ్ నర్స్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ సంఘీభావంగా చంద్రగిరి సీహెచ్‌సీ ముందు సోమవారం వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. డాక్టర్ అరుణ మాట్లాడుతూ వైద్య సేవలు అందిస్తున్న వైద్యులపై, సిబ్బందిపై రోగులు దాడి చేయడం దారుణమన్నారు.

రైలు పట్టాలపై వృద్ధురాలి ఆత్మహత్య



నరసింగాపురం రైల్వే గేటు వద్ద ఆత్మహత్య చేసుకున్న వృద్ధురాలు

చంద్రగిరి, జూలై 8: చంద్రగిరి మండలం, నరసింగాపురం రైల్వే గేటు సమీపంలో పట్టాలపై ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు భాకరాపేట సమీప గ్రామానికి చెందిన ఆదెమ్మ(70) నరసింగాపురంలోని తన సమీప బంధువుల ఇంటికి వచ్చింది. సోమవారం మధ్యాహ్నం నరసింగాపురం రైల్వే గేటు సమీపంలో ఆమె మృతదేహం కనిపించడంతో స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ మల్లికార్జున సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భాకరాపేట ఘాట్‌లో లోయలోకి దూసుకెళ్లిన లారీ



చంద్రగిరి, జూలై 8: చంద్రగిరి మండల పరిధిలోని పీలేరు, తిరుపతి జాతీయ రహదారిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో లారీ అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. భాకరాపేట నుంచి తిరుపతి వైపు వస్తున్న లారీ ఘాట్ రోడ్డు మలుపు వద్దకు రాగానే అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో డ్రైవర్ మధుబాబు, క్లీనర్‌లకు ప్రాణాపాయం తృటిలో తప్పింది. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలకు పూర్వవైభవం తీసుకురండి

ఈవోతో టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం

తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు పూర్వవైభవాన్ని తీసుకురావాలని టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం టీటీడీ ఈవోను శ్యామలరావును కోరారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం ఆయన ఈవోను మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలలో స్థానికులకు, నిర్వాసితులకు న్యాయం చేయాలని, గత ఐదేళ్లలో వారి డిమాండ్లను నెరవేర్చే క్రమంలో జరిగిన అవకతవకలను వివరించారు. కొండపై దళారీ వ్యవస్థను అరికట్టాలన్నారు. ప్రమోద్‌కుమార్, రఫీ, మధురవాణి విద్యాసంస్థల చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరికి హంద్రీ నీవా జలాలు వచ్చేనా..?

గత టీడీపీ హయాంలో మొదలైన పనులు - 2019 ఎన్నికల కోడ్ రావడంతో బ్రేక్ - వైసీపీ అధికారంలోకి వచ్చాక పనుల రద్దు

చంద్రగిరి, జూలై 8: చంద్రగిరి మండలానికి హంద్రీ నీవా జలాలు వచ్చేనా అంటూ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2019వ సంవత్సరంలో టీడీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత మండలమైన చంద్రగిరిని సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో హంద్రీ నీవా జలాలు తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టారు. ఈ పనుల నిర్మాణం కోసం రూ.39.411 కోట్ల అంచనాలతో టెండర్లు పిలిచారు. ఈ టెండర్‌ను నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుని పనులు కూడా ప్రారంభించింది. అయితే ఈపైపులైను వేసే మార్గంలో 10.4 కిలోమీటర్ల దూరం అటవీ ప్రాంతం ఉండటంతో అటవీశాఖ అనుమతులు తీసుకొని, 20 శాతానికి పైగా పనులు చేపట్టారు. ఈ క్రమంలో 2019లోనే ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ పనులను రద్దు చేశారు. అంతకుముందు మదనపల్లె నుంచి అడవిపల్లె రిజర్వాయర్‌కు వస్తున్న హంద్రీ నీవా నీటిని.. అడవిపల్లె సమీపంలోని పసంవారిపల్లె వద్ద నుంచి చంద్రగిరి మండలంలోని మూలపల్లె చెరువుకు 18.4 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ ద్వారా తీసుకొచ్చేందుకు పనులు చేపట్టారు. పసంవారిపల్లె నుంచి మూలపల్లె చెరువు వరకు నీటి సరఫరా కోసం పైపులను అమర్చేందుకు రోడ్డు పక్కన దింపారు. మూడు 70 హెచ్‌పీ మోటర్లతో మూడు పైప్ లైన్ల ద్వారా మూలపల్లె చెరువుకు హంద్రీనీవా జలాలను తీసుకొచ్చి అక్కడ నుంచి కొండ్రెడ్డి కండ్రిగ చెరువుకు, చిన్నరామాపురం వద్దవున్న కణితమడుగు చెరువుకు, అక్కడ నుంచి ఎ.రంగంపేట వద్ద వున్న నాగపట్ల చెరువుకు, అక్కడ నుంచి కొటాల వద్ద వున్న వెంకట్రాయుని చెరువుకు కాలువలను అనుసంధానం చేసే విధంగా పనులు చేపట్టారు. దీంతో మొత్తం ఐదు చెరువులకు ఈపైపుల ద్వారా 10 క్యూసెక్కుల నీటిని తరలించనున్నట్లు అప్పట్లో అధికారులు వెల్లడించారు. ఈ ఐదు చెరువులు నిండితే మండలంలో భూగర్భ జలాలు పెరగడమే కాక సాగు, తాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయి. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ పనులు పునః ప్రారంభమవుతాయని చంద్రగిరి మండల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.





అప్పట్లో రోడ్డు పక్కన హంద్రీ నీవా జలాలు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంచిన పైపులు - పసంవారిపల్లె నుంచి మూలపల్లె చెరువుకు నీటి సరఫరా చేయడానికి అధికారులు రూపొందించిన మ్యాప్



కొండ్రెడ్డికండ్రిగ చెరువు

మూలపల్లె చెరువుకు రెండు కిలోమీటర్ల దూరంలో కొండ్రెడ్డికండ్రిగ చెరువు ఉంది. దీని విస్తీర్ణం 7.56 చదరపు మైళ్లు కాగా ఆయకట్టు 110.92 ఎకరాలు. 5.50 ఎంసీఎఫ్టీ నీటి నిల్వ ఉంటుంది. సుమారు 70 మంది రైతులకు ఈనీటి ద్వారా లబ్ధి చేకూరనుంది.

చంద్రగిరి మండలంలోని ఐదు చెరువుల సామర్థ్యం



మూలపల్లె చెరువు

మూలపల్లె చెరువు భీమవరం అటవీ ప్రాంతంలో ఉంది. దీని విస్తీర్ణం 16 చదరపు మైళ్లు కాగా ఆయకట్టు 259.19 ఎకరాలు. ఇందులో 12.50 ఎంసీఎఫ్టీ నీరు స్టోరేజ్ ఉంటుంది. సుమారు 200 మంది రైతులు ఈనీటిని వినియోగించుకోనున్నారు.



కణితమడుగు చెరువు

మండలంలోని చిన్నరామాపురం వద్ద కణితమడుగు చెరువు ఉంది. దీని విస్తీరణం 8.24 చదరపు మైళ్లు కాగా ఆయకట్టు 500 ఎకరాలు. 10 ఎంసీఎఫ్టీ నీటి నిల్వ ఉంటుంది. సుమారు 350 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.



నాగపట్ల చెరువు

మండలంలో ఎ.రంగంపేట వద్ద నాగపట్ల చెరువు ఉంది. విస్తీరణం 7.61 చదరపు మైళ్లు కాగా ఆయకట్టు 167.92 ఎకరాలు. ఇందులో 7.50 ఎంసీఎఫ్టీ నీటి నిల్వ ఉంటుంది. 100 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.



వెంకట్రాయుని చెరువు

మండలంలోని కొటాల గ్రామం వద్ద వెంకట్రాయుని చెరువు ఉంది. ఈ చెరువు విస్తీర్ణం 0.17 చదరపు మైలు కాగా ఆయకట్టు 116 ఎకరాలు. ఇందులో 4.90 ఎంసీఎఫ్టీ నీటి నిల్వ ఉంటుంది. ఈచెరువు నిండితే 50 మంది రైతులకు సాగునీటి సమస్య తీరుతుంది.

ఎర్రచందనం స్వాధీనం

ఒక స్మగ్లర్ అరెస్టు



పట్టుబడ్డ ఎర్రచందనంతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, జూలై 8: అన్నమయ్య జిల్లా పీలేరు అటవీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు సోమవారం కూంబింగ్ నిర్వహించి, 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన విష్ణువర్ధన్‌కుమార్ బృందం ఆదివారం అన్నమయ్య జిల్లా కేవీపల్లి మండలం పీలేరు అటవీ ప్రాంతంలో ఎల్లమందకు చేరుకుని మంచాల మంద వైపు కూంబింగ్ చేసుకుంటూ వెళ్లారు. తెల్లవారుజామున వీరు మారెళ్ల అటవీ బీటు పరిధిలో పింఛానది సమీపానికి చేరుకోగా కొంతమంది వ్యక్తులు తలలపై ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా.. వారు దుంగలను పడేసి పారిపోయారు. వారిని వెంబడించిన పోలీసులు ఒకరిని పట్టుకోగలిగారు. అతడు తమిళనాడు వేలూరు జిల్లా అనైకట్టు ప్రాంతానికి చెందిన బలరామన్ పెరియస్వామి(44)గా గుర్తించి, అరెస్టు చేశారు. అక్కడ పడి ఉన్న 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంగళం ట్రెండ్స్ పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్‌ను అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

మంగళం, జూలై 8: మంగళం ట్రెండ్స్ జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైర్డ్ అయిన స్టీఫెన్ గాబ్రియల్, వసుంధర కలిసి సోమవారం కంప్యూటర్‌ను అందచేశారు. వారు పనిచేసిన పాఠశాలకే కంప్యూటర్ ఇవ్వడం సంతోషకరమని ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు ప్రశంసించారు. ఈ కంప్యూటర్‌ను పాఠశాల అవసరాలకు వినియోగిస్తామన్నారు.

బృందావనం.. దీనాతిదీనం

- గాలికొదిలేసిన జగన్ ప్రభుత్వం
- నీరుగారుతున్న చంద్రబాబు సదాశయం
- గోళ్లు గిల్లుకుంటున్న గ్రీన్ అంబాసిడర్లు
- గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త నిల్వలు





గంగిరెడ్డిపల్లె బృందావనం గదిపై రేకుల తొలగింపు - షెడ్డుకు చేరిన రామాపురం బృందావనం

రామచంద్రాపురం, జూలై 8: చెత్త నుంచి సంపద సృష్టించాలనే సదాశయానికి జగన్ ప్రభుత్వం గండికొట్టింది. ఇందుకోసం ఏర్పాటైన బృందావనాల నిర్వహణను గాలికొదిలేసింది. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు చెత్త నుంచి ఆదాయం సమకూర్చేందుకు పదేళ్ల క్రితం నాటి చంద్రబాబు ప్రభుత్వం బృందావనాలను ఏర్పాటు చేసింది.. గంగిరెడ్డిపల్లె, నడవలూరు, దేశూరికండ్రిగ, కుప్పంబాదూరు, రాయలచెరువుపేట, పాలేపల్లి, అనుపల్లి, కొత్తవాసకుప్పం, రామాపురం గ్రామాల్లో లక్షలాది రూపాయలతో షెడ్లను నిర్మించింది. చెత్త తరలింపునకు ట్రైసైకిళ్లను కొనుగోలుచేసింది.18మందికిపైగా గ్రీన్ అంబాసిడర్లను నియమించింది. వీరు చెత్తను సేకరించి బృందావనాలకు తరలించేవారు. తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేసేవారు. ప్లాస్టిక్, ఇనుప సామగ్రి, సేంద్రియ ఎరువుల విక్రయం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరేది.

పునరుద్ధరణకు ఎదురుచూపు

వైసీపీ ప్రభుత్వం రావడంతో బృందావనాల నిర్వహణపై నిర్లక్ష్యం వహించింది. పంచాయతీ నిధులను జగన్ సర్కారు దారి మళ్లించడంతో బృందావనాల నిర్వహణకు పైసా లేక సర్పంచులు చేతులెత్తేశారు. ట్రైసైకిళ్లు మూలకు చేరిపోయాయి. ఇప్పుడవి తుప్పు పడుతున్నాయి. వీటిపై ఆధారపడిన గ్రీన్ అంబాసిడర్లు పనిలేక ఇళ్లకు పరిమితమయ్యారు. తొట్టెలు, షెడ్లు నిర్వహణ లేక పాడైపోతున్నాయి. ముళ్లచెట్లతో నిండిపోయి ఉనికి కోల్పోతున్నాయి. నెల క్రితం గంగిరెడ్డి బృందావనం వద్ద పైకప్పు రేకులను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకుపోయారు. రామాపురం షెడ్డుకు వేసిన టెంకాయి పీచులు ఊడిపోయాయి. పునరుద్ధరించడానికి రూ.6లక్షలు కావాలని పంచాయతీ విస్తరణ అధికారి జిల్లా అధికారులకు ప్రతిపాదించారు. మరికొన్నాళ్లు బృందావనాలను ఇలాగే వదిలేస్తే పూర్తిగా పనికి రాకుండాపోతాయనడం నిస్సందేహం. మరోపక్క చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. వర్షాకాలం సమీపిస్తుండటంతో అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి బృందావనాలను పునరుద్ధించాల్సిన అవసరముంది.

హైకోర్టు ఆదేశాలను అమలు చేయండి

విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ డ్రైవర్ల వినతి

తిరుపతి(ఆటోనగర్), జూలై 8: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తూ అనారోగ్యానికి గురై తిరిగి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న తమను విధుల్లోకి తీసుకోవాలని బాధిత డ్రైవర్లు పీవీ రెడ్డి, పీవై రెడ్డి, ధనంజయులు విజ్ఞప్తి చేశారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీలో 2013కు ముందు విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురై తాము సెలవులో ఉన్నామని, తిరిగి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు హైదరాబాదులోని తార్నాక ఆర్టీసీ కేంద్ర ఆస్పత్రి నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకొచ్చినా అధికారులు విధుల్లోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమాదిరిగా 13 జిల్లాల్లో 900 మంది బాధితులు ఉన్నారని, తిరుపతి జిల్లాలో 50 మంది డ్రైవర్లు ఉన్నట్లు వారు చెప్పారు. అధికారులు తమను విధుల్లోకి తీసుకోకపోవడంతో 2016లో హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. 2024 ఏప్రిల్ 29న హైకోర్టు తమను విధుల్లోకి తీసుకోవాలని తీర్పు ఇచ్చిందన్నారు. అధికారులు మాత్రం విధుల్లోకి తీసుకోవడానికి ససేమిరా అంటున్నారని చెప్పారు. ఆర్టీసీలో సేవలందించి అనారోగ్యానికి గురైతే సర్వీసు నుంచి తొలగించేస్తారా అని వారు ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యానికి గత పదేళ్ల నుంచి తమ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని వాపోయారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

17న కురబ కుల ప్రజాప్రతినిధులకు సన్మానం

తిరుపతి(ఆటోనగర్), జూలై 8: సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన కురబ కుల ప్రజాప్రతినిధులకు తిరుపతిలో ఈ నెల 17న సన్మానం చేయనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీనివాసులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు తమ కులస్తులకు రాజకీయంగా చేయూతనిచ్చారని చెప్పారు. తమ కులస్తులకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించి గెలిపించడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. తిరుపతి పాత తిరుచానూరు రోడ్డులోని ఎస్సార్ కన్వెన్షన్ హాలులో 17వ తేది మధ్యాహ్నం 2.30 గంటలకు సన్మాన కార్యక్రమం జరుగుతుందని ఆయన వెల్లడించారు.

వైభవంగా బృహద్వారాహిదేవి తిరుమంజనం



ప్రత్యేక అలంకారంలో వారాహిదేవి

రామచంద్రాపురం, జూలై 8: రాయలచెరువుకట్ట శ్రీశక్తి పీఠంలో వెలసిన వారాహిదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం బృహద్వారాహిదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొపి తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకారం చేపట్టారు. ఉదయం వేదపండితులు వారాహి హోమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం కుర్తాళం పీఠాధిపది సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధిపతి రమ్యానంద భారతిస్వామి పూర్ణాహుతితో హోమం ముగించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ మేళతాళాల నడుమ నిర్వహించారు.సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులనుఅలరించాయి.

వైఎస్‌కు నివాళులు



చంద్రగిరిలో కేక్ కట్ చేస్తున్న మోహిత్‌రెడ్డి

చంద్రగిరి/భాకరాపేట/పాకాల/రామచంద్రాపురం, జూలై 8: చంద్రగిరి వైసీపీ కార్యాలయం వద్ద సోమవారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నగొట్టిగల్లు, పాకాల మండలాల్లో వైఎస్ విగ్రహానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. రామచంద్రాపురం మండలం నెన్నూరులో ఎంపీపీ బ్రహ్మానందారెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్ధంతరంగా వదిలేసిన ఈరోడ్డుకు మోక్షం ఎప్పుడో..!

ప్రమాదాలకు నిలయంగా మారిన మలుపు





అర్ధంతరంగా వదిలేసిన రోడ్డు - ప్రమాదాలకు కారణమవుతున్న డబుల్ రోడ్డు

తిరుపతి రూరల్, జూలై 8: తిరుపతి 150వ జాతీయ రహదారి కూడలి నుంచి ఆర్‌సీపురానికి వెళ్లే దారిలో చిగురువాడ శివాలయం(స్వర్ణముఖినది) వరకు ఎన్నికలకు ముందు హడావిడిగా తుడా నిధులతో కొత్త రోడ్డు నిర్మించిన విషయం తెలిసిందే. ఈమార్గంలో వేదాంతపురంలోని సీపీఆర్ విల్లాస్ నుంచి సంస్కృతనగర్ వరకు కొంతదూరం రోడ్డు వేయకుండా అర్ధంతరంగా వదిలిపెట్టేశారు. ఇక్కడ ఎదురెదురుగా రెండు వాహనాలు వచ్చినప్పుడు వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది. తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఇదే మార్గంలో సంస్కృతనగర్ వద్ద ప్రమాదకర మలుపు ఉంది. ఈమార్గంలో తిరుపతి-పచ్చికాపల్లం వరకు ప్రతినిత్యం వందలాది వాహనాలు, విద్యాసంస్థల బస్సులు, నగరపాలక సంస్థకు చెందిన చెత్తతో కూడిన లారీలు, ద్విచక్రవాహనాలు ఎక్కువసంఖ్యలో ప్రయాణిస్తుంటాయి. అయినా ఈమలుపు వద్ద సూచికబోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. సీపీఆర్‌విల్లాస్ ఎదురుగా వేసిన డబుల్ రోడ్డు మధ్యలో ప్యాచ్ వర్క్ పూర్తి చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అదేవిధంగా అర్ధంతరంగా వదిలేసిన రోడ్డును త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా రోడ్డుకి అడ్డంగా విద్యుత్ లైన్‌కి సంబంధించిన పోల్స్ ఉండటంతో కొంతదూరం రోడ్డువేయకుండా వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. పాలకులు ఈ దిశగా దృష్టిసారించి చర్యలు చేట్టాల్సిన అవసరం ఉంది.

సంస్కృతవర్సిటీలో బ్రిడ్జ్ కోర్సు ప్రారంభం

తిరుపతి రూరల్, జూలై 8: తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీలో ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా ఆచార్య(పీజీ) కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఐదురోజుల పాటు నిర్వహించే బ్రిడ్జ్ కోర్సుని సోమవారం వర్సిటీలోని చెలికాని అన్నారావు సభా భవనంలో ప్రారంభించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ వర్సిటీలో ఆఫర్ చేసే 15కిపైగా వివిధశాస్త్రాలకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు పరిచయం చేసేందుకు ప్రతిఏటా ఈ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్కృత భాష, శాస్త్రాల్లోని జ్ఞానాన్ని సరళంగా, సులభంగా తెలుసుకునేందుకు ఈ బ్రిడ్జ్ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అకడమిక్‌డీన్ శుక్లా, కోఆర్డినేటర్ సి.రంగనాథన్, అడిషనల్ కోఆర్డినేటర్ యశస్వి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆరణి, సుగుణమ్మలను సన్మానించిన నాయకులు

కూటమి నేతలను ఇబ్బంది పెట్టిన వైసీపీ వాళ్లను చేర్చుకోవద్దు

తిరుపతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలను ఇబ్బంది పెట్టిన వైసీపీ వాళ్లను టీడీపీ, బీజేపీ, జనసేనల్లో చేర్చుకోవద్దని పలువురు నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో అఖండ మెజార్టీ దక్కడంలో ఎన్డీఏ కూటమి నేతలు చేసిన కృషికి క్లస్టర్ల వారీగా మూడు పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలపడానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం 13, 14, 15 డివిజన్లకు సంబంధించిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్ వర్మ, జనసేన టౌన్ అధ్యక్షుడు రాజా రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి వరప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం బైరాగిపట్టెడలోని వైఖానస మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని కూటమి నేతలు సత్కరించారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ఘనవిజయం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మబ్బు దేవ నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టిన వైసీపీ నేతలు నెల కూడా గడవక ముందే కూటమి పార్టీల్లోకి రావాలని చూస్తున్నారని, అటువంటి వారిని అడ్డుకుంటామని స్పష్టంచేశారు. జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో చాలామంది కూటమి నాయకులు, కార్యకర్తలు జైలుకెళ్లాల్సి వచ్చింద నిజ చెప్పారు. కూటమి శ్రేణులను ఇబ్బందులకు గురిచేసిన వాళ్లను పార్టీల్లో చేర్చుకోరాదని అన్నారు. పదవుల భర్తీలోనూ జైలు కెళ్లి.. కష్టాలు పడ్డ వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

కష్టపడ్డ వారికే పదవులు : ఎమ్మెల్యే ఆరణి

కష్టపడ్డ వారికి పదవులు దక్కేలా తాను బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. కూటమిలోకి ఏ పార్టీ వాళ్లు చేరాలన్నా మొదట డివిజన్ స్థాయి నాయకులతో చర్చించాకే నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. నాయకులు ఆచితూచి మాట్లాడాలని కోరారు. ఎవరూ అభద్రతా భావానికి గురి కావద్దని, పార్టీకి ఎవరు పనిచేశారో తెలుసునని, వాళ్ల అంతరాత్మకు ఇంకా బాగా తెలుసన్నారు. పైన వెంకటేశ్వర స్వామి చూస్తున్నాడని, తప్పు చేసిన వారికి శిక్ష ఖాయమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను కలిసి సమస్యలు పరిష్కరించుకుందామని చెప్పారు. తిరుపతి పవిత్రతను కాపాడాలని అందరినీ కోరుతున్నా అన్నారు. అనంతరం 18నుంచి 22వ డివిజన్ల సమావేశం యూత్ హాస్టల్‌లో జరిగింది.

నీళ్ల కోసం..

- వానొచ్చినా తప్పని హైరానా
- కళ్లు కాయలు కాచేలా కొళాయిలవైపు ఎదురుచూపు
- ట్యాంకర్ వస్తే తోపులాటలే



బీటీఆర్ కాలనీలో కొళాయిల వద్ద మహిళలు

తిరుపతి, ఆంధ్రజ్యోతి: వేసవి ముగిసింది. వానలు మొదలయ్యాయి. కానీ నగరంలో కొన్ని ప్రాంతాల్లో మంచినీటి కోసం కొళాయిల దగ్గర పడిగాపులు కాయాల్సి వస్తోంది. కొన్ని చోట్ల తెలుగుగంగ నీళ్లు నాలుగు రోజులకోసారి వదులుతున్నారు. నగరంలో నాలుగు లక్షలకుపైగా జనాభా, లక్షకుపైగా యాత్రికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరికీ రోజూ 64.7 ఎంఎల్‌డీ నీరు అవసరమవుతోంది. అయితే ప్రస్తుతం కార్పొరేషన్ చేతిలో సుమారు 50 ఎంఎల్‌డీపై నీటి సామర్థ్యం లేదు. తిరుపతికి కల్యాణిడ్యామ్, కైలాసగిరి రిజర్వాయర్ ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి. వీటిలో కల్యాణి డ్యామ్‌లో నీరు అక్టోబరు వరకు ఢోకాలేదని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. 200 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యమున్న కైలాసగిరి రిజర్వాయర్‌లో నీటినిల్వలు తగ్గిపోతున్నాయి. కండలేరు నుంచి రోజుకు 27 ఎంసీఎఫ్‌టీ నీటిని నింపుతున్నారు. అక్కడినుంచి రోజుకు 40 ఎంఎల్‌డీ నీటిని నగరానికి పంపింగ్ చేస్తున్నారు. ఇది ఏమాత్రం సరిపోవడం లేదు. మిగతా చోట్ల ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. తెలుగుగంగ నీటిని 45 వార్డుల్లో రోజు మార్చి రోజు, 20, 21, 22 వార్డుల్లో మాత్రం మూడ్రోజులకోసారి సరఫరా చేస్తున్నట్టు కార్పొరేషన్ లెక్కలు చెబుతోంది. అయితే ఇవి ప్రభుత్వానికి లెక్కలు చూపించుకునేందుకు తప్ప, క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి. శివారుప్రాంతాల్లో అయితే నీటి సమస్య మరింత తీవ్రంగా ఉంది. నీళ్లు కావాలని ఒకటికి నాలుగుసార్లు కార్పొరేషన్ అధికారులకు ఫోన్ చేస్తే మొక్కుబడిగా ట్యాంకర్‌ను పంపుతున్నారు. వీధిలోకి ట్యాంకర్ వచ్చిందంటే తోపులాటలే కనిపిస్తున్నాయి. ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్లకు వేల రూపాయలు పోసి నీటిని కొనుక్కోవాల్సి వస్తోంది. అదేవిధంగా తాగునీటి కోసం వాటర్ క్యాన్లను కొనుగోలు చేసుకుంటున్నారు. నీటి కొరతపై ప్రజా సంఘాలతోపాటు కూటమి నేతలు కూడా కార్పొరేషన్‌పై ఒత్తిడి తెస్తున్నారు. ● చెన్నారెడ్డి కాలనీలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్‌లో 120 మంది ఉన్నారు. ఇక్కడ కార్పొరేషన్ అందించే నీరు సరిపోవడం లేదు. రోజూ ఓ వాటర్ ట్యాంకర్‌ను పంపాలని హాస్టల్ సిబ్బంది కమిషనర్‌ను కోరారు. ● బీటీఆర్ కాలనీలో వారానికి రెండు సార్లు మాత్రమే నీళ్లు వదులుతున్నారు. ఇంట్లో నీటి సంపు ఉన్నవాళ్లు పట్టిపెట్టుకుని వాడుకుంటారు. లేనివారు డ్రమ్ములను నింపుకుని మళ్లీ నీళ్లు వదిలేవరకు పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి.

టీడీపీ నేతల ఒత్తిడితో పలుచోట్ల పరిష్కారం



ఎంఆర్‌పల్లెలో పాడైన మోటర్‌ను మున్సిపల్ అధికారులతో రిపేర్ చేయించిన టీడీపీ నేతలు

ఎంఆర్‌పల్లె నీటిసమస్యపై స్థానిక టీడీపీ నేతలు గత వారం పీజీఆర్‌ఎస్‌లో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించకుంటే స్థానికులతో కలసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. దాంతో పద్మావతి మహిళా వర్సిటీ ఎదురుగా పాడైన మోటరును రిపేర్ చేసి నీటి సరఫరా ఏర్పాటు చేశారు. టీడీపీ బీసీ నాయకుడు ఆముదాల తులసీదాస్ నేతృత్వంలో వార్డు నాయకులు రవికుమార్, రెడ్డెప్పల ఒత్తిడితో అధికారులు ఎట్టకేలకు సమస్యను పరిష్కరించారు.

టీటీడీలో ప్రక్షాళన మొదలుపెట్టండి: జనసేన



షరీఫ్‌కరీముల్లాకు వినతిపత్రమిస్తున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, జూలై 8: టీటీడీలో తక్షణమే ప్రక్షాళన మొదలు పెట్టాలని ఈవో శ్యామలరావుకు జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక పరిపాలన భవనంలో ఈవోను మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు. అనంతరం తిరుమలలో మతాలపేరుతో జరుగుతున్న అవినీతి, టీటీడీలో అధికార దుర్వినియోగం వంటి అంశాలు, మాజీ మంత్రులు దర్శన టిక్కెట్ల కుంభకోణంపై ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇదే విషయమై పలుమార్లు ప్రస్తావించారని గుర్తుచేశారు. కొండపై భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే స్టేట్ విజిలెన్స్ స్పెషల్ ఆఫీసర్ షరీఫ్ కరీముల్లాను కలసి పైవిషయాలపై ఫిర్యాదుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభాషిణి, సుమన్‌బాబు, రుద్రకిషోర్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో కష్టపడ్డవారికి ప్రాధాన్యమివ్వండి

- లోకేశ్‌ను కలిసిన టీడీపీ కార్పొరేటర్



తిరుపతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ను 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. సోమవారం మంగళగిరిలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. కష్టపడ్డ ప్రతి ఒక్కరినీ గుర్తు పెట్టుకుంటామని, వారికి మంచి భవిష్యత్ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, జగ్గా, మణి నాయుడు, బాలాజీ, రవితేజ పాల్గొన్నారు.

'ఈ- స్టాంప్'లు మాకొద్దు



తిరుపతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జగనన్న ఈ-స్టాంప్ పేపర్లు రద్దు చేసి, పాతవాటినే అమలు చేయాలని స్టాంప్ వెండర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. నాన్ జ్యుడిషియల్ స్టాంపుల ముద్రణలో నాణ్యతలేదని, 'ఈ-స్టాంపు'ల వలన వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వాపోయారు. పాత రెవెన్యూ స్టాంపులు కేటాయించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ నాయకులు ఖాజాపీర్, కల్పన, రామ్మూర్తి, హరిప్రసాద్, మస్తాన్, కృష్ణకుమారి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న పీపీఎస్ఎన్‌పీ శాస్త్రి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 8: ఎల్‌బీసీ రోడ్‌లోని ఆఫీసర్స్ క్లబ్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. పలు అంశాలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీపీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి నాగరాజు, రామమూర్తి, సిద్ధయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌కు నివాళులు



వైఎస్ విగ్రహానికి పూలమాల వేసిన కరుణాకర రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), జూలై 8: వైఎస్ జయంతి సందర్భంగా సోమవారం గురవారెడ్డి సమాధుల వద్ద ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ శిరీష, కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వినాయక సాగర్‌లో మౌలిక వసతుల లేమి

- పట్టించుకోని అధికారులు



వినాయకసాగర్ ముఖచిత్రం

తిరుపతి (జీవకోన), జూలై8: నగర పరిధిలోని కరకంబాడి రోడ్డులో ఉన్న వినాయక సాగర్‌ను కోట్లాది రూపాయల స్మార్ట్‌సిటీ నిధులతో అందంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్, బ్యూటిఫికేషన్, చిన్నారులు ఆడుకునేందుకు ఆట పరికరాలు, సాగర్ చుట్టూ లైటింగ్, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తలపించేలా ఎంట్రన్స్‌లో పూలమొక్కలతో సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో స్థానికులంతా ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్ చేస్తుంటారు. కుటుంబ సమేతంగా వెళ్లి కాసేపు సేద తీరడానికి కూడా వినాయకసాగర్ ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. కానీ సాగర్‌లో మౌలిక వసతులు పూర్తిగా కరువయ్యాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సాగర్‌లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టకపోవడం గమనార్హం. ప్రతిరోజు వాకింగ్ నిమిత్తం వచ్చి స్థానికులు, ఆదివారం సమయాల్లో ఆహ్లాదం కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీరు ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

బాధితులందరికీ న్యాయం జరగాలి : కలెక్టర్

- కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు 115 అర్జీలు



జశ్వంత్ సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 8: బాధితులందరికీ న్యాయం జరగాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి 115 అర్జీలు అందాయి. వీటిల్లో భూ సమస్యలపైనే 57 ఉన్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా వీల్‌చైర్‌లో వచ్చిన అర్జీదారుల వద్దకే కలెక్టర్ స్వయంగా వెళ్లి సమస్యను తెలుసుకున్నారు. డీఆర్వో పెంచలకిషోర్‌తో పాటు ఎస్‌డీసీలు కోదండరామిరెడ్డి, మురళి, దేవేంద్రరెడ్డి, ఏవో జయరామయ్య తదితరులు అర్జీలు స్వీకరించారు.

పింఛను పెరిగేలా చేయండి

'మా కుమారుడు జశ్వంత్ (13) మానసిక వైకల్యంతో బాధపడుతున్నాడు. దీంతో సాధారణ పింఛను వచ్చేది. పూర్తిగా కండరాల వ్యవస్థ పనిచేయకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. అందువల్ల రూ.6 వేలకు బదులు రూ.15వేలు వచ్చేలా చేయండి' అని తిరుపతి రూరల్ మండలం పేరూరుకు చెందిన జశ్వంత్ తండ్రి భాస్కర్ విజ్ఞప్తి చేశారు.

ఐదేళ్లుగా తిరుగుతున్నా న్యాయం జరగలేదు



నాకు పూర్తిగా చెవులు వినబడవు. మాటలు కూడా సరిగ్గారావు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లుగా పింఛను కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదు. - హరి, వికృతమాల, ఏర్పేడు మండలం

కౌలుకు ఇస్తే భూమిని కబ్జా చేశాడు



పిత్రార్జితంగా వచ్చిన ఆరు సెంట్ల భూమిని సాగు చేసుకుంటున్నాం. ఇటీవల ఓ వ్యక్తికి ఈ భూమిని కౌలుకు ఇచ్చాం. అతను రెవెన్యూ అధికారుల సాయంతో దొంగ పాసుపుస్తకాలు సృష్టించుకుని ఆన్‌లైన్ పేరు మార్చుకున్నాడు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. -చెంగయ్య, మద్దిలేడు, శ్రీకాళహస్తి మండలం

రెండో ఆటోనగర్ ఏర్పాటు చేయండి



15 ఏళ్లుగా తిరుపతి ఆటోనగర్‌లో ఆటో మొబైల్స్ మెకానిక్‌లుగా జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న స్థలం చాలడం లేదు. రెండో ఆటో నగర్ ఏర్పాటు చేయండి - **మెకానిక్‌లు జుంలేషా, సుబ్రహ్మణ్యం రెడ్డి, శ్రీనివాసులు, గోపి తదితరులు**

పీజీఆర్ఎస్ అర్జీలకు ప్రాధాన్యం : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 8: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే అర్జీలకు ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ హర్షవర్ధనరాజు అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌కి వచ్చిన బాధితులతో ఎస్పీ మాట్లాడి, వారి నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 73 అర్జీలు వచ్చాయి. కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవి వెంటనే పరిష్కరించాలని డీఎస్పీలను ఆదేశించారు.

పోలీసు పరేడు గ్రౌండులో ఫుడ్ కోర్టు

పోలీసు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసు పరేడ్ గ్రౌండులో సోమవారం ఫుడ్ కోర్టును ఎస్పీ ప్రారంభించారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా పోలీసులకు నాణ్యమైన భోజనం, అల్పాహారం అందించడమే ప్రధాన ధ్యేయమని చెప్పారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్, నరసింగప్ప, సీఐలు, ఆర్‌ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను ఓపిగ్గా అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

శెట్టిపల్లె సమస్యలను పరిష్కరించండి

- కమిషనర్‌కు టీడీపీ వినతి



కమిషనర్‌కి అర్జీని అందజేస్తున్న సుగుణమ్మ తదితరులు

తిరుపతి అర్బన్, జూలై 8: శెట్టిపల్లె సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కోరారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో టీడీపీ నాయకులతో కలిసి ఈ మేరకు కమిషనర్ అదితిసింగ్‌కు అర్జీ సమర్పించారు. ఎంఆర్‌పల్లె మున్సిపల్ పార్కు వద్ద వీధి లైట్లు వెలగడంలేదని, ఉప్పరపాళెం హరిజనవాడలో తెలుగుగంగ నీటి సరఫరా చేయడం లేదని, యూడీఎస్ ఏర్పాటు చేయలేదని, సప్తగిరినగర్, మధురానగర్ ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉంటోందని, ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ పేరిట చేస్తున్న వసూళ్లను ఆపాలని, మహిళా వర్సిటీ ముందు ఫుట్‌పాత్ ఆక్రమణలను అరికట్టాలని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ తిరుమాలికమోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్‌రెడ్డి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నీట్ సీట్స్ అలాట్‌మెంట్ బుక్‌లెట్లు సిద్ధం

9849016661 నంబరుకు వాట్సప్ సందేశం పంపితే వివరాలు

తిరుపతి(విద్య), జూలై 8: నీట్ సీట్స్ అలాట్‌మెంట్ బుక్‌లెట్లు సిద్ధమైనట్లు ఐబిటీ, నీట్ ఫోరం ఓ ప్రకటనలో తెలిపింది. నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్ష రాసి రాంక్స్ పొందిన విద్యార్థుల అవగాహన కోసం నీట్-2023 సీట్ అలాట్‌మెంట్ బుక్‌లెట్స్‌ను సిద్ధం చేసినట్లు ఫోరం వెల్లడించింది. మొత్తం 19 బుక్‌లెట్స్ ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్ రౌండ్ 1, రౌండ్ 2, మాప్ అప్ రౌండ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ర్యాంక్ వారీ, రిజర్వేషన్‌వారీగా సీట్ల కేటాయింపు వివరాలను పొందుపరిచినట్లు వెల్లడించారు. డిజిటల్ రూపంలో బుక్‌లెట్లను పొందగోరువారు, ఇతర సమాచారం కోసం నీట్ బుక్‌లెట్ అని టైప్‌చేసి వాట్సప్ నంబరు 98490 16661 నంబరుకు మెసేజ్ పంపాలని సూచించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు

తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 78,912 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 32,039 మంది తలనీలాలు సమర్పించారు.

విధుల్లోని సిబ్బందికి రక్షణ కల్పించండి

రుయా పరిపాలనా భవనం ముందు స్టాఫ్ నర్సుల నిరసన



నినాదాలు చేస్తున్న నర్సులు

తిరుపతి(వైద్యం), జూలై 8: విధుల్లోని సిబ్బందికి రక్షణ కల్పించాలని రుయాస్పత్రిలోని స్టాఫ్‌నర్సులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రి పరిపాలన భవనం ముందు నిరసన తెలిపారు. ఏఎంసీ వార్డుకు విధులకు హాజరైన కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు యశోదపై ఆదివారం రాత్రి ఓ రోగి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయాన్ని ఖండించారు. వీరికి మద్దతుగా ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఏపీఎన్జీవోస్ నేతలు వరప్రసాద్, సురేష్ నిలిచారు. నేతలు మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులకు భద్రతగా మగ సెక్యూరిటీ గార్డులను అందుబాటులో ఉంచాలన్నారు. వెంటనే జరిగిన విషయంపై విచారణ చేపట్టి బాధితురాలికి వైద్య ఖర్చులు భరించడమే కాకుండా వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం యూనియన్ నేతలతో కలిసి స్టాఫ్‌నర్సులు సూపరింటెండెంట్ రవిప్రభుకు వినతిపత్రం అందజేశారు. దాడి చేసిన వ్యక్తికి మతిస్థిమితం లేని కారణంగా ఇలాంటి దురదృష్ట ఘటన జరిగిందని, అతనిపై చర్యలు తీసుకుంటామని, బాధితురాలికి సెలవులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. హెడ్‌నర్సులు, రాధ, భువనేశ్వరి ఏపీ హంస నేతలు ఇమ్రాన్, గిరిబాబు, శాంతకుమార్, స్వర్ణలత, జయలక్ష్మి పాల్గొన్నారు.

దాడి ఘటనపై మంత్రి ఆరా

సోమవారం సాయంత్రం రుయా సూపరింటెండెంట్ రవిప్రభుకు ఫోన్ చేసి జరిగిన ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరా తీశారు. బాధితురాలు కోలుకునే వరకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేస్తామని, వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. కాగా, తక్షణమే స్పందించిన మంత్రికి ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఏపీఎన్జీవోస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు నైనారు వరప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నిందితుడిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం): స్టాఫ్ నర్సుపై దాడి చేసిన ఘటనలో నిందితుడు దుర్గాప్రసాద్‌పై తిరుపతి వెస్ట్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ జయనాయక్ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం రాజానగర్‌కు చెందిన దుర్గాప్రసాద్ రుయాలో చికిత్స పొందుతున్నాడు. శనివారం రాత్రి అట్రాసిన్ ఇంజక్షన్ ఇచ్చారు. అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయి ఉన్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి విధులకు హాజరైన స్టాఫ్ నర్సు యశోదపై ఉన్నట్టుండి సెలైన్ స్టాండుతో తలపై దాడి చేశాడు. నర్సు తలకు తీవ్రగాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు చికిత్స పొందుతుండడంతో డిశ్చార్జి చేశాక అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

పోలీసులకు కాసులు కురిపిస్తున్న ఇసుక ట్రాక్టర్లు

- స్టేషన్ బెయిల్ ముసుగులో దందాలు
- రూ.5వేల నుంచి రూ.10వేల దాకా వసూళ్లు



గతంలో సెబ్ అధికారులు సీజ్ చేసి.. పోలీసులకు అప్పగించిన ఇసుక ట్రాక్టర్లు

తిరుపతి(నేరవిభాగం), జూలై8: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి జిల్లా పోలీసు యంత్రాంగం గట్టి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 10 రోజుల వ్యవధిలో సెబ్ పరిధిలోని సిబ్బంది 26 ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని సంబంధిత పోలీసు స్టేషన్లకు అప్పగించారు. పోలీసులు సైతం 8 ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ట్రాక్టర్లను మాత్రం తహసీల్దార్లకు అప్పగించి.. వారి ద్వారా మైన్స్ అండ్ జియాలజీ శాఖకు లేఖ రాసి అపరాధ రుసుం విధించి న్యాయస్థానం ద్వారా ట్రాక్టర్‌ను విడుదల చేస్తారు. ఇసుకను మాత్రం ప్రభుత్వ నిబంధనల మేర విక్రయిస్తారు. జిల్లా పరిధిలోని ఆరు సెబ్‌స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది.. ఎస్పీ ఆదేశాలకు అనుగుణంగా ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నా కేసులు నమోదు చేసే అధికారం సెబ్‌కు లేదు. దీంతో ఎక్కడ పట్టుకున్నా సంబంధిత పోలీసుస్టేషన్లకు అప్పగించి, కేసులు నమోదు చేస్తున్నారు. ఈ విషయంలో ఇసుక ట్రాక్టర్ మాత్రం సీజ్‌లో ఉంటుంది. డ్రైవర్లు, ట్రాక్టర్ ఓనర్లకు స్టేషన్‌బెయిల్ ఇచ్చి పంపే అధికారం పోలీసులకు మాత్రమేవుంది. ఇక్కడే తిరకాసు ఉంది. సంబంధిత డ్రైవర్లు, ఓనర్లకు స్టేషన్ బెయిల్ ఇచ్చే విషయంలో కొందరు పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వున్నాయి. దీనిపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సైతం గుర్రుగా వున్నట్లు తెలిసింది. స్టేషన్ బెయిల్ కోసం ట్రాక్టర్ల యజమానుల నుంచి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వున్నాయి. దీంతో సెబ్‌కు కేసులు.. పోలీసులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇలాంటి ఘటనలు ఎక్కువగా తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి, చంద్రగిరి, పాకాల, సత్యవేడు పరిధిలో జరుగుతున్నట్లు బాధితులు చెపుతున్నారు. దీనిపై ఎస్పీ విచారించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగించాలి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 8: ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం ఏర్పడేలా వైద్యం అందించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం ఆమె స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయో లేదో రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పోరేట్‌కు దీటుగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చొరవతీసుకుంటామన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, బుజ్జిబాబు, ఆలీబాయ్, శశిధర్ తదిరులు పాల్గొన్నారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

పెళ్లకూరు, జూలై 8 : మండల అభివృద్ధిపై ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం మండల స్థాయి అధికారులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు సోమవారం ఈ విషయం తెలిపారు. మండలంలో చేపట్టాల్సిన అబివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాల అమలుపై ఆయన చర్చించనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నాయుడుపేట, జూలై 8 : నాయుడుపేటలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. వ్యవసాయ శాఖ, నిఘా విభాగం అధికారులు దాడుల్లో పాల్గొన్నారు. వ్యవసాయశాఖ ఏడీఏ ఎల్లప్ప మాట్లాడుతూ లైసెన్స్ దారులందరూ స్టాక్ రిజిస్టార్, బిల్లు పుస్తకాలు క్రమం తప్పకుండా పాటించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంఆర్‌పీకి మించి ఒక్కరూపాయి కూడా అదనంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజిలెన్స్ ఎస్ఐ జీవానందం, ఏడీఏ ధనంజయరెడ్డి, ఏవో గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతరాయంగా ఇసుక ఉచిత సరఫరా

వెంకటగిరి, జూలై 8 : ఇసుక ఉచితంగా నిరంతరాయంగా అందజేస్తామని మ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఇసుక సరఫరా మొదలు కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక సామాన్యుడికి అందుబాటులో లేదన్నారు. వైసీపీ పెద్దలు దోపిడీ చేయడం వల్ల ఇసుక దొరక్క భవనిర్మాణ కార్మికులు వలస బాటపట్టారన్నారు. ఇప్పుడు భవన నిర్మాణ రంగానికి పూర్వ వైభవం వస్తుందన్నారు. రీచ్‌లతోపాటు, అనువుగా వుండేలా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

గూడూరు, జూలై 8: పలు గ్రామాల్లో తాగునీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ సోమవారం ప్రజావిజ్ఞప్తుల వేదికలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు విన్నవించారు. మంచినీటికి బదులుగా ఉప్పునీరు సరఫరా అవుతోందన్నారు. చిట్టమూరు మండలం మల్లాంలో తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న పిచ్చయ్యనాయుడు

చిల్లకూరు, జూలై 8: చేడిమాల, గిరిజనకాలనీ, నల్లయ్యగారిపాళెంలోని ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం రాజనేని రామానాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నతస్థాయి చేరుకోవాలని ట్రస్ట్ అధ్యక్షుడు పిచ్చయ్యనాయుడు ఈసందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన గిరిజన నాయకులు

వెంకటగిరిటౌన్, జూలై 8: వెలగపూడి సచివాయం వద్ద ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు గద్దల మున్నెయ్యతోపాటు గిరిజన నాయకులు సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధిగ్రస్థుల కోసం డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు. గోషాసుపత్రిని వంద పడకలుగా విస్తరించాలని, మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరామని నాయకులు తెలిపారు.

10న ఎమ్మెల్యే పాశం విజయోత్సవ ర్యాలీ

చిట్టమూరు, జులై 8 : చిట్టమూరులో ఈ నెల 10న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బుధవారం ఉదయం గణపర్తి అన్నయ్య నాయుడు పార్క్ నుంచి ఎమ్మెల్యే ఊరేగింపుగా చిట్టమూరుకు చేరుకుంటారన్నారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం, పతాకావిష్కరణ, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహ శంకుస్థాపన, రైతు సేవాకేంద్రం భవనం, పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహ ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొంటారన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

కొత్తగుంటలో కోళ్ల వ్యర్థాల తొలగింపు

● ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన



చిట్టమూరు, జులై 8 : కొత్తగుంటలో రోడ్డుకిరువైపుల పడేసిన కోళ్ళ వ్యర్థాలను బుధవారం అధికారులు తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం కొత్తగుంటను కమ్మేస్తోన్న కాలుష్యం శీర్షికన ప్రచురతమైన వార్తకు మండల అధికారులు, పంచాయతీ పాలక వర్గం స్పందించారు. ఈవోపీఆర్‌డీ మనోహర్‌గౌడ్, సర్పంచ్ ఈదూరు కోటయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు కొత్తగుంట పరిశర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా పడేసిన కోళ్ళ వ్యర్థాలను పరిశీలించారు. ఎక్స్‌కవేటర్ ద్వారా వాటిన గ్రామానికి దూరంగా ట్రాక్టర్ల ద్వారా తరలించారు. వ్యర్థాలను రోడ్డు పక్కన పడేస్తే చర్యలు తీసుకుంటామని మనోహర్ గౌడ్ హెచ్చరించారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

కోట, జూలై 8 : వాహనచోదకులు హెల్మెట్ తప్పని సరిగా ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని పోలీసులు కోరారు. పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డులో సోమవారం హెల్మెట్ ధారణపై ఎఎస్ఐ శోభారాణి, హెడ్‌కానిస్టేబుల్ బి. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. కోట నుంచి వాకాడు వైపు నాయుడుపేట, గూడూరు వైపు వెళ్లే వాహనచోదకులతో వారు మాట్లాడారు. హెల్మెట్ ధరించకపోతే జరిగే నష్టాలను వివరించారు. ప్రయోగాత్మకంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

రూ. 2.79 లక్షల ఎరువుల సీజ్



పురుగుమందుల షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

వెంకటగిరిటౌన్, జూలై 8: పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై ఏడీఏ నాగార్జునసాగర్, ఏవో సుజాత సోమవారం దాడులు నిర్వహించారు. రూ. 2.79లక్షల సరుకును సీజ్ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ గోకులకృష్ణ ట్రేడర్స్, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్‌లలో 12.8 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశామన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులను పంపిణీ చేయాలన్నారు. లైసెన్స్ లేకుండా విక్రయిస్తే డీలర్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. కొనుగోలు చేసిన సరకులకు బిల్లులు ఇవ్వాలన్నారు.

శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం



రహదారిని పరిశీలిస్తున్న జాతీయ రహదారి అధికారులు

తడ, జూలై 8 : శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని జాతీయ రహదారి సైట్ ఇంజనీర్ల బృందం తెలిపింది. తడలో ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్‌లను సోమవారం ఈ బృందం పరిశీలించింది. శ్రీసిటీ జీరోపాయింట్ బోడిలింగాలపాడు మలుపును పరిశీలించి ప్రత్యామ్నాయ మార్గాలపై వివరాలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ శ్రీసిటీ జీరోపాయింట్‌కు ఇరువైపులా కిలోమీటరు దూరంతో నాలుగు లేన్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. బృందంలో సైట్ ఇంజనీర్లు రోహిత్, మహేష్, కేశవరెడ్డి, తడ, తడకండ్రిగ సర్పంచులు ఆర్మూగం, శశికుమార్, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, తదితరులు ఉన్నారు.

గిరిజనుడి కుటుంబానికి ఎమ్మెల్యే సాయం



కోట, జూలై 8 : స్థానిక శ్రీలక్ష్మమ్మ కాలనీలో మృతిచెందిన తుపాకుల పాపయ్య అనే గిరిజనుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పాశం డాక్టర్ సునీల్‌కుమార్ రూ.10వేలు అందజేశారు. మాజీ ఎంపీపీ మానికల పవన్ రూ.3వేలు, పట్టణ టీడీపీ తరపున రూ. 2వేలు అందజేశారు. టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, ఎంపీటీసీ షంషుద్దీన్, నాయకులు కిరణ్, నౌషాద్, పోలమ్మ, నాయబ్, సురేష్, బాబు, సుహాసిని తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వాకాడు, జూలై 8 : మండల టీడీపీ అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వాకాడులోని రెడ్డివానితిప్ప గిరిజన కాలనీలో నిత్యావసర సరుకులను, పేద విద్యార్థినికి కాలేజీ ఫీజును టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి తిరుమలశెట్టి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. కేక్‌ను కట్‌చేసి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినం శుభాకాంక్షలు తెలిపిన వారిలో షేక్ రహంతుల్లా, చిరంజీవమ్మ, మల్లాపు నాగరాజు, బాలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తీపలపూడి అన్వేష్, మదార్‌సాహెబ్ తదితరులు ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు

తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 78,912 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 32,039 మంది తలనీలాలు సమర్పించారు.

పేదలకు నేటి నుంచి ఉచిత ఇసుక సరఫరా

● ఉత్తర్వుల విడుదలలో తొలిరోజు ఆలస్యం



డిపో వద్ద ఇసుక ట్రాక్టర్లు

దొరవారిసత్రం, జూలై 8: స్థానిక నేతాజీ నగర్ ఇసుక డిపోలో సోమవారం ఇసుక ఉచిత సరఫరా వాయిదా పడింది. మైనింగ్ శాఖ అధికారుల అంచనాల ప్రకారం 21,400 మెట్రిక్ టన్నుల ఇసుక ఈ డిపో నుంచి సరఫరాకు వీలుంది. ఈమేరకు ప్రజలకు సమాచారం అందింది. దీంతో ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి వాహనాలతో ఇసుక డిపో వద్ద బారులు తీరారు. మైనింగ్ శాఖ ఆర్ఐ మురళి, ఇన్‌చార్జి తహశీల్దార్ గోపినాథ్ రెడ్డి, ఇసుక సరఫరాకు ఏర్పాట్లు చేశారు. అయితే ప్రభుత్వం నుంచి జీవో విడుదల కాలేదంటూ మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా చేయలేదు. తరువాత జీవో విడుదలైనా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక సరఫరా చేయలేదని సాయంత్రం 5 గంటలకు అధికారులు తెలియజేశారు. సాంకేతిక లోపాలను సరిదిద్ది మంగళవారం నుంచి సరఫరా చేస్తామన్నారు.

తాజా నిర్ణయంతో మేలు



కొత్త ప్రభుత్వ ఇసుక పాలసీతో డిపోలో టన్నుకు వివిధ ఛార్జీలు రూ.465 నిర్ణయించడంతో ట్రాక్టరుకు గతం కంటే రూ.వెయ్యి తగ్గింది. వైసీపీ ప్రభుత్వంలో రూ.670 టన్ను ధర ఉండేది. తాజా నిర్ణయం వల్ల లబ్ధిదారులకు ఎంతో ఉపయోగం.

-నంచి సురేష్ మావిళ్లపాడు

పేదలకు ఎంతో ఉపయోగకరం



ఇసుక అందిస్తామని చెప్పడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచేశాం. అధికారుల వద్ద సరైన సమాచారం లేకపోవడంతో రోజంతా ట్రాక్టర్ల డ్రైవర్లు ఇబ్బందులు పడ్డారు. తగ్గిన ధరల వల్ల పేదవారికి ఎంతో ఉపయోగకరం.

-పాపారెడ్డి ధనుంజయ రెడ్డి వీఎస్ఆర్ నగర్

ఆక్రమణ తొలగింపుపై మాజీ ఎమ్మెల్యే రుసరుస



ఉద్యోగితో సంజీవయ్య వాగ్వాదం

నాయుడుపేట టౌన్, జూలై 8 : ఆక్రమణల తొలగింపుపై మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయుడుపేట పాతబస్టాండ్ నుంచి ఎల్ఐసీ రహదారి మధ్యలో రైల్వే ప్రహరీకి ఆనుకొని ఉన్న నేషనల్ హైవేకి సంబంధించిన స్థలంలో గత నెల రోజుల్లో ఆక్రమణదారులు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు.దీనిపై నేషనల్ హైవే అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆశాఖ జేఈ వెంకటేశ్వర్లు సోమవారం మున్సిపల్ ఉద్యోగులు, పోలీసుల సహాయంతో ఎక్స్‌కవేటర్ ద్వారా ఎల్ఐసీకార్యాలయం సమీపం నుంచి ఆక్రమణలు తొలగింపు ప్రారంభించారు. అదే సమయంలో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య అనుచరులతో ర్యాలీగా వెళ్తున్నారు. నిర్మాణ స్థలం వద్ద ఆగి ఎవరి అనుమతితో ఇక్కడ ఆక్రమణలు తొలగిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై అధికారులు కొంత ప్రాంతం మేర ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు ఇచ్చినట్లు నేషనల్ హైవే ఉద్యోగి చెప్పారు. వాటి పత్రాలను చూపించారు. పాత బస్టాండ్ నుంచి ఆక్రమణలు తొలగించాకే ఇక్కడ తొలగించాలంటూ సంజీవయ్య అక్కడ పనిచేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను తిప్పి పంపివేశారు. అక్కడ కాస్సేపు స్వల్ప ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.

త్వరితగతిన ప్రజా సమస్యల పరిష్కారం:పాశం



అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు అర్బన్, జూలై 8: త్వరితగతిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ప్రజావిజ్ఞప్తుల దినం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించి అప్పటికప్పుడే సంబంధిత అధికారికి ఇచ్చి పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అధికారులు కూడా ఇందుకు సహకరించాలన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ, ఆర్డీవో కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, అబ్దుల్ రహీం, నాగరాజు, పలుశాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ పథకంపై విస్తృత ప్రచారం



అవగాహన కల్పిస్తున్న నిరంజన్‌కుమార్

కోట, జూలై 8 : ప్రధానమంత్రి కిసాన్ పథకంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఈ పథకంపై సహాయ వ్యవసాయ అధికారులకు ఒక్కరోజుపాటు శిక్షణ నిర్వహించారు. అర్హులైన రైతులు చిన్న చిన్న పొరపాట్ల వల్ల ఈ పథకం కింద లబ్ధిపొందలేకపోతున్నామన్నారు. పొరపాట్లను సరిదిద్దాలన్నారు. డెల్టా, నాన్‌డెల్టా గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరించాలన్నారు. రైతులు అవగాహన కల్పించాలన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

సూళ్లూరుపేట, జూలై 8: జిల్లా స్థాయి తైక్వాండ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు సూళ్లూరుపేట టైనీటాట్స్ సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. నెల్లూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి పవన్‌కుమార్ ఈ విషయం తెలిపారు. జిల్లాలో జరిగిన తైక్వాండో పోటీలో క్యారెట్ విభాగంలో దేవిశ్రీ, లిఖిత కుమారి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ ఇద్దరూ అనంతపురంలో ఆగస్టు మొదటి వారంలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, పాఠశాల కరస్పాండెంట్ వేనాటి ధనుంజయ రెడ్డి అభినందించారు.

డొంక పొరంబోకు ఆక్రమణపై ఫిర్యాదు

సూళ్లూరుపేట, జూలై 8: కోటపోలూరులోని బృందావనం లేఅవుట్‌లో డొంకపొరంబోకును ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మహిళా నాయకురాలు ఇసనాక వాణి కోరారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ కేవీ గోపాలకృష్ణకు ఆమె ఈమేరకు వినతిపత్రం అందజేశారు. నాలుగు అర్జీలు అందినట్లు తహశీల్దార్ తెలిపారు.

మా కడుపు కొట్టవద్దు...

● మెకానిక్ యూనియన్ నేత ఆలీ వినతి



మెకానిక్ యూనియన్ నాయకులు

నాయుడుపేట టౌన్, జూలై 8 : తమ కడుపు కొట్టవద్దని మెకానిక్ యూనియన్ నాయకులు ఆలీ ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్ సమీపంలోని సోమవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో మెకానిక్ కార్మికులతో కలసి ఆయన మాట్లాడారు. 50 సంవత్సరాలుగా పాత బస్టాండ్ నుంచి ఐసీఐసీ బ్యాంక్ వరకు ఉన్న స్థలంలో మెకానిక్ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ త్వరలోనే తమ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అయితే మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య నేషనల్ హైవే అధికారులతో పాత బస్టాండ్ నుంచి ఆక్రమణలు తొలగించాలనడం సబబుకాదన్నారు. గతంలో ఆయన ఆటో స్టాండ్ నిర్మిస్తామని మాట నిలబెట్టుకోలేదన్నారు.

నేను బడికిపోతా ర్యాలీ



కోట, జూలై 8 : స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో సోమవారం నేను బడికిపోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ జరిగింది. మండల విద్యాశాఖాధికారి దారా మస్తానయ్య పర్యవేక్షణలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ప్లకార్డులు పట్టుకొని బడిఈడు కలిగిన పిల్లలు బడిలోనే ఉండాలంటూ ర్యాలీ నిర్వహించారు. బాలిక విద్యను ప్రోత్సహించాలంటూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

అడుగంటుతున్న జలాలతో అన్నదాత కలవరం



నీరు రాని మోటారు

కోట, జూలై 8: నేలబావుల్లో నీరు అడుగంటుతుండడంతో మెట్ట రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 11 పంచాయతీల్లోని మెట్ట గ్రామాల్లో నేల బావుల ఆధారంగా సాగు చేస్తుంటారు. డెల్టా రైతులకు దీటుగా కొన్ని పర్యాయాలు వరి రెండుకార్లు పండిస్తారు. ఈ ఏడాది కూడా తక్కువ పెట్టుబడులతో తక్కువ కాలంలో పంట చేతికి అందే 1010 రకం వరి సాగు చేశారు. పంట చివరితడి వచ్చే సరికి నీరు అడుగంటుతుండడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా మెట్ట గ్రామాల్లోని 33 చెరువులకు గంగ 5వ బ్రాంచ్ కెనాల్ నుంచి తెలుగుగంగ వదులుతారు. ఈ ఏడాది 4 చెరువులకు మాత్రమే వదలడంతో కొన్ని ఎండిపోయాయి. పదును వర్షం కూడా కురవక పోవడంతో ఆశలు వదులుకున్నారు.

తిరుమలేశుడి సేవలో కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి



తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి విద్యాప్రసన్న తీర్థస్వామి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో మహద్వారం వద్దకు చేరుకున్న విద్యాప్రసన్నకు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శిష్య బృందంతో ఆలయంలోకి వెళ్లిన విద్యాప్రసన్న ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అదేవిధంగా శ్రీవారిని గోవా స్పీకర్ రమేష్ తవడ్కర్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నాయకుల ఘన నివాళి





పెళ్లకూరులో అన్నదానం చేస్తున్న సంజీవయ్య- రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాంకుమార్‌రెడ్డి

పెళ్లకూరు, జూలై 8 : వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా సోమవారం మండలంలో ఆయన విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పెళ్లకూరులో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. **వెంకటగిరిటౌన్:** ఎన్‌జేఆర్ భవన్‌లో వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదుమల్లి రాంకుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. **కోట** : గూడలిలో వైసీపీ నాయకులు హేమారెడ్డి షనిల్‌రెడ్డి, పల్లెమల్లు విజయసారథిరెడ్డి, వరదారెడ్డి, లొక్కు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **సూళ్లూరుపేట:** ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **వాకాడు** : కొడవలూరులో భక్తవత్సల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్‌ను కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. వైసీపీ నాయకులు కలసి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి వైఎస్ఆర్ గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, బాబురెడ్డి, తదితరులు ఉన్నారు. **గూడూరు:** స్థానిక బనిగీసాహెబ్‌పేటలో ఎమ్మెల్సీ మేరగ మురళీధర్‌రావు ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూలవేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేశారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

బాధితులందరికీ న్యాయం చేయాలి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 8: బాధితులందరికీ న్యాయం జరగాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి 115 అర్జీలు అందాయి. వీటిల్లో భూ సమస్యలపైనే 57 ఉన్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా వీల్‌చైర్‌లో వచ్చిన అర్జీదారుల వద్దకే కలెక్టర్ స్వయంగా వెళ్లి సమస్యను తెలుసుకున్నారు. డీఆర్వో పెంచలకిషోర్‌తో పాటు ఎస్‌డీసీలు కోదండరామిరెడ్డి, మురళి, దేవేంద్రరెడ్డి, ఏవో జయరామయ్య తదితరులు అర్జీలు స్వీకరించారు.

ఐదేళ్లుగా తిరుగుతున్నా

నాకు పూర్తిగా చెవులు వినబడవు. మాటలు కూడా సరిగ్గారావు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లుగా పింఛను కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి

- హరి, వికృతమాల

కౌలుకు ఇస్తే కబ్జా చేశాడు

పిత్రార్జితంగా వచ్చిన ఆరు సెంట్ల భూమిని సాగు చేసుకుంటున్నాం. ఇటీవల కౌలుకు ఇచ్చాం. అతను దొంగ పాసుపుస్తకాలు సృష్టించుకుని ఆన్‌లైన్ పేరు మార్చుకున్నాడు. అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు.

- చెంగయ్య, మద్దిలేడు

భక్తులతో కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 8: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల కిక్కిరిసిపోయింది. స్వామివారికి సోమవారం ప్రీతికరమైన రోజు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,333మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,297మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,568మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,166, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 387మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 238మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 44మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 22,272 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మా భూమి ఆక్రమించుకున్నారు... న్యాయం చేయండి

సత్యవేడు, జూలై 8: తమ భూమిని సత్యవేడుకు చెందిన సుబ్రహ్మణ్యం ఆక్రమించుకున్నారని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని ముత్తులక్ష్మి అనే మహిళ కన్నీటి పర్యంతమైంది. సోమవారం సత్యవేడు ప్రెస్‌క్లబ్‌లో ఆమె తన గోడును వెళ్లబోసుకుంది. సత్యవేడు మండలం చిన్నఈటిపాకంలోని సర్వే నెంబరు 280/9, 281, 282/3లో మొత్తం 1-85 సెంట్ల భూమిని తనకు పసుపు కుంకుమ కింద తల్లిదండ్రులు ఇచ్చారని తెలిపారు. తాను చెన్నై ఆవడిలో నివాసం ఉండడంతో తన భూమిని సత్యవేడుకు చెందిన సుబ్రహ్మణ్యం ఆక్రమించుకున్నారని ఆరోపించారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, స్పందనలో కూడా ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా తాము ఆ భూమిని 20 ఏళ్లముందే కొనుగోలు చేశామని చెప్పారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

సత్యవేడు, జూలై 8: కౌలు రైతులకు సాగు గుర్తింపు కార్డు ఇచ్చేందుకు సంబంధిత సిబ్బంది చొరవ చూపాలని సత్యవేడు అగ్రికల్చర్ ఏడీఏ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వ్యవసాయ శాఖ, రెవెన్యూ సిబ్బందితో కౌలు రైతుల అంశంపై సమీక్షా సమావేశం జరిగింది. తహసీల్దార్ రామాంజనేయులు మాట్లాడుతూ మండలంలో 130 మంది కౌలు రైతులు ఉన్నారని, వారికి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గుర్తింపు కార్డులను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీఈవోలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు పనులు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

వరదయ్యపాళెం, జూలై 8: వరదయ్యపాళెం మండలంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం పర్యటించిన విషయం తెలిసిందే. శ్రీకాళహస్తి నుంచి తడ వెళ్లే మార్గంలో బత్తలవల్లం పంచాయతీ నుంచి రాచకండ్రిగ వరకు ఉన్న రోడ్డు దుస్థితిని స్థానికులు, టీడీపీ నాయకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్ చేసి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరారు. స్పందించిన అధికారులు సోమవారం ఉదయాన్నే రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు. టీడీపీ నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నిర్మల్‌కుమార్, నాగరాజుయాదవ్, విష్ణు, రామలింగారెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమేళా

ఏర్పేడు, జూలై 8: పాపానాయుడుపేట రాస్ సేవా నిలయంలో సోమవారం రైతు రుణమేళా జరిగింది. వ్యవసాయంలో మెళకువలపై శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ బాలాజీరెడ్డి, శాస్త్రవేత్తలు రాముకుమార్, క్షేత్రస్థాయి అధికారి వెంకట్‌కుమార్, మునేంద్ర, మునిపార్థసారథి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ రోడ్డుకు మరమ్మతులు చేయండి

రేణిగుంట, జూలై 8: పట్టణంలోని బీసీ హాస్టల్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు విద్యార్థులతో కలిసి రోడ్డుపై నిరసన తెలిపారు. సోమవారం విద్యార్థులతో కలిసి గోతులమయమైన రోడ్డును పరిశీలించారు. సీపీఎం నేత రమణ మాట్లాడుతూ బీసీ హాస్టల్‌కు వెళ్లే రోడ్డును మరమ్మతులు చేయాలని అనేకసార్లు తహసీల్దారుకు, ఎంపీడీవోకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. రోడ్డుకు ఇరువైపుల ముళ్లపొదలు ఉండటం వల్ల రాత్రి సమయంలో పాములు హాస్టల్‌కి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డులో లైట్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా బీసీ హాస్టల్ రోడ్డుకు మరమ్మతులు చేసి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

శాస్త్రోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు

శ్రీకాళహస్తి, జూలై 8: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామివారికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంలో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామి వారిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

తాగునీటి బోరు ప్రారంభం



బోరు ప్రారంభిస్తున్న బొజ్జల రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 8: పట్టణంలోని 27వ వార్డు పరిధిలో ఉన్న లోబావి సెంటర్‌లో తాగునీటి బోరును ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి సోమవారం ప్రారంభించారు. బోరు వేయించి ఇంటింటి కుళాయి ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇక్కడి ప్రజలు తాగునీటి సమస్యను సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం నెలరోజుల లోపు తాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. అనంతరం లోబావి సెంటర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టిని తొలగించండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 8: మండలంలోని శ్రీకాళహస్తి - తడ రహదారి పక్కన పైపులైన్‌కు తవ్విన మట్టి రోడ్డుపై పోయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గత రెండు నెలలుగా శ్రీకాళహస్తి నుంచి బీఎన్‌కండ్రిగ మండలం మీదుగా గ్యాస్ పైపులైను కోసం కాలువ తవ్వుతున్నారు. పైపులైను అమర్చిన తరువాత మట్టిని పూడ్చి చదును చేయకపోవడవంతో వాహనదారులు రాత్రిపూట ప్రమాదాలకు గురవుతున్నారు. బీఎన్ కండ్రిగ సబ్‌స్టేషన్ నుంచి కాంపాళెం సెంటర్, తానగల్లు వరకు గత వారం రోజుల్లో వరుస ప్రమాదాలు జరగడంతో ఎస్‌ఐ వెంకటనరసింహ సోమవారం పరిశీలించారు. రోడ్డు మలుపుల వద్ద మట్టి ఎక్కువగా ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్‌ఐ తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్లు పైపులైను కోసం తవ్విన కాలువను వెంటనే పూడ్చి చదును చేయాలని కోరారు.

వసతిగృహాల తనిఖీ

శ్రీకాళహస్తి, జూలై 8: పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న గురుకుల పాఠశాల వసతిగృహం, పిచ్చాటూరు రోడ్డులోని బీసీబాలికల, ఇక్కడి సమీపంలోని బాలసదన్ వసతిగృహాలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి సోమవారం రాత్రి తనిఖీ చేశారు. తెలుగుగంగ గురుకుల హాస్టల్‌లో బాత్ రూముల తలుపులు విరిగిపోయి అధ్వానంగా ఉండడం గుర్తించారు. ఇక బీసీ బాలికల వసతిగృహంలో సరిపడేంత ఆహారం సరఫరా చేయడంలేదని.. గుడ్లు పంపిణీ సరిగా జరగడం లేదని పిల్లలు వాపోయారు. బృందమ్మ మాట్లాడుతూ సమస్యలపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు చేపడుతామన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన

శ్రీకాళహస్తి, జూలై 8: పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, తొట్టంబేడు మండలం కాసరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం కుష్టు, క్షయ, సీజనల్ వ్యాధుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంవో డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని మచ్చలు, పొడలు, లావుగా మారిన నొప్పితో కూడిన నరాలు, ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా చర్మం ఉంటే కుష్టువ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. నిర్ధారణ కోసం సమీపంలోని ప్రభుత్వాస్పత్రుల్లో పరీక్షించుకోవచ్చన్నారు. ఇందుకు ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శివకుమార్‌రెడ్డి, స్రవంతి, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం

తారకరామనగర్, జూలై 8: తారకరామనగర్‌లో వాటర్ ట్యాంక్ నుంచి ఏర్పాటు చేసిన మెయిన్ పైపులైను లీకేజీ ద్వారా తాగునీరు వృథా అయ్యి మురుగుగుంటకు తరలిస్తోంది. ట్యాంకులో నీరు పూర్తైతే కానీ నీటి వృథా ఆగడం లేదు. నీటి నిల్వకు తోడు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ట్యాంక్ వద్ద తాగునీరు కలుషితం అవుతోంది. దీని వల్ల జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, పైపులైనుకు మరమ్మతులు చేపట్టాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు

వరదయ్యపాళెం, జూలై 8: మండలంలోని యానాదివెట్టు వద్ద రోడ్డు గుంతలమయంగా మారి దుస్థితికి చేరుకుంది. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడేవారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగేవి. స్పందించిన ఎస్‌ఐ ప్రతాప్ ఎక్స్‌కవేటరు సాయంతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. గ్రామస్తులు, వాహనదారులు ఎస్‌ఐ ప్రతాప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రగ్స్‌ను అరికట్టండి

వరదయ్యపాళెం, జూలై 8: డ్రగ్స్‌ను అరికట్టాలని జనసేన నాయకులు ఎస్‌ఐ ప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లావణ్యకుమార్, చిరంజీవియాదవ్, బాషా, తులసి, కేశవ్, కృష్ణ, పృథ్వీ, వేలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన కలెక్టర్

నాగలాపురం, జూలై 9: నాగలాపురం మండల పరిధిలోని సుబ్బానాయుడు కండ్రిగ ఇసుక స్టాక్ పాయింట్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరిశీలించారు. అక్కడ ఆగి ఉన్న, లారీ, ట్రాక్టర్ల యాజమానులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఇసుక పాలసీ విధానం ప్రకారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఇసుకను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఆన్‌లైన్ పే మెంట్ చేసి తీసుకోవచ్చన్నారు. ఎవరైనా నిబంధనలను ఇసుకను తమిళనాడు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గతంలో భూమిపూజ చేసిన సురుటుపల్లి, దాసుకుప్పం బైపాస్ రోడ్డుకి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సహకరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కలెక్టర్‌ను కోరారు. అక్కడినుంచి కలెక్టర్, ఎమ్మెల్యేతో కలిసి సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయాన్ని సందర్శించారు. వారికి అర్చకులు, సిబ్బంది పూర్ణ కుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు కల్పించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంఖర్ రెడ్డి, తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీవో బాబు, వీఆర్వో నాగభూషణం, ఎస్‌ఐ ఓబయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సుబ్బానాయుడు కండ్రిగ ఇసుక స్టాక్ పాయింట్ వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆదిమూలం

సాంకేతిక లోపంతో ప్రారంభం కాని ఇసుక పంపిణీ

నాగలాపురం/పిచ్చాటూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన ఇసుక పాలసీ విధానం సోమవారం నుంచి అమల్లోకి వస్తున్నట్లు ప్రకటించింది. దీంతో నాగలాపురం మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ ఇసుక పాయింట్ వద్ద వందల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లు బారులుతీరాయి. ఇసుక పాయింట్‌ను ప్రారంభించేందుకు శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి వచ్చారు. అయితే సాంకేతక కారణాల వల్ల ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో ఇసుక కేటాయింపులు జరపలేదు. అలాగే పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు స్టాక్ పాయింట్ వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. అనుమతులు రాలేదంటూ ఇసుకను లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. మంగళవారం నుంచి మెట్రిక్ టన్ను రూ.200 చొప్పున ఒక ఆధార్‌కార్డుకి 20 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు.

కల్యాణ వెంకన్న సేవలో కలెక్టర్, ఎమ్మెల్యే



కలెక్టర్, ఎమ్మెల్యేలను ఆశీర్వదిస్తున్న అర్చకులు

నారాయణవనం, జూలై 8: నారాయణవనంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామిని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆదిమూలం దర్శించు కున్నారు. సోమవారం సాయంత్రం ఆలయానికి చేరుకున్న కలెక్టర్, ఎమ్మెల్యేలకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామికి కలెక్టర్, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. వారిని అర్చకులు ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరణియార్ పర్యాటక కేంద్రం పనుల పరిశీలన

పిచ్చాటూరు, జూలై 8: ఆరణియార్ రిజర్వాయర్‌లో కోటి రూపాయలతో ఏపట్టిన పర్యాటక కేంద్రం పనులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జైకా నిధులు రూ.36 కోట్లతో చేపట్టిన ఆరణియార్ రిజర్వాయర్ ఆధునికీరరణ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయని, వాటిని పునఃప్రారంభించాల్సిన అవసరం ఉందని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, పద్మరాజు, జయచంద్ర నాయుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 8: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా పట్టణంలోని బాబుఅగ్రహారం కూడలి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. అన్నదానం చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి ఆపార్టీ నేత డాక్టర్ బత్తెయ్యనాయుడు నివాళులర్పించారు.

సత్యవేడు: స్థానిక నేతాజీ రోడ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకుల నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అంతకు మునుపు వైసీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్ వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

రేణిగుంట: పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వరదయ్యపాళెం: మండలంలో నిర్వహించిన వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నూకతోటి రాజేష్, మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ నివాళులర్పించారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

శ్రీకాళహస్తి, జూలై 8: ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని న్యాయవాది రాజేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు.

రోడ్లపైనే చెత్తదిబ్బలు

తారకరామనగర్, జూలై 8: రేణిగుంట మండలం తారకరామనగర్‌లో రోడ్లపై చెత్త దిబ్బలుగా పేరుకుపోయింది. చెత్త నుంచి వెలువడే దుర్వాసనకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది చెత్తను తాత్కాలికంగా తొలగిస్తున్నా, స్థానికులు చెత్త వేయడానికి తగిన స్థలం లేకపోవడంతో నిల్వ చేరుతోంది. రోగాలు ప్రబలే అవకాశం ఉందని, అధి కారులు చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే సారూ... దృష్టి సారించాలి మీరు

నేడు సత్యవేడు మండల మీట్ - హాజరుకానున్న ఆదిమూలం

సత్యవేడు, జూలై 8: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం తొలిసారిగా మంగళవారం సత్యవేడు మండల మీట్ జరగనుంది. ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన జరగనున్న మండల మీట్‌కు ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. మండలంలో సుదీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఇవీ సమస్యలు: ప్రధానంగా సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో ఐదేళ్లుగా వైద్యుల కొరత వేదిస్తోంది. దీంతో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదు. 2017లో అప్పటి టీడీపీ హయాంలో నిర్మించిన అదనపు భవనాలు నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఈ భవనాలు ఆస్పత్రిలోని కిందిస్థాయి ఉద్యోగులకు ఆవాసా కేంద్రాలుగా మారిపోయాయి. వైద్యుల కొరతను తీర్చి, భవనాలను అందుబాటులోకి తీసుకురావాలి. బ్లడ్‌బ్యాంకు, డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. ప్రజారవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి బస్సులు సమయపాలన లేక ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా సత్యవేడు - తిరుమల ఎక్స్‌ప్రెస్‌లను లింక్ సర్వీసుల పేరుతో వారంలో నాలుగు రోజులు తిరుపతికే పరిమితం చేయడం వల్ల విద్యార్థులు, రోగులు, ఉద్యోగులు బాధలు పడుతున్నారు. మారుమూల గ్రామాల్లో బస్సులు నడపాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఛిద్రమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి. నత్తనడకన సాగుతున్న పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి. డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం ఏర్పాటు చేయాలి.

కైలాసనాథుడికి రూ.12 లక్షల వెండి అభరణాలు



వెండి ఆభరణాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, దాతలు

నారాయణవనం, జూలై 8: మండల పరిధిలోని కైలాసకోనలో నెలకొన్న కైలాసనాథుడికి రూ.12 లక్షల విలువచేసే వెండి ఆభరణాలను తిరుపతికి చెందిన దాతలు బహూకరించారు. సోమవారం దాతలు వెంకట్ నాగేశ్వరరెడ్డి, సాయిగీత, సుగుణకర్ రెడ్డి, మల్లీశ్వరి, తిరుపతి మేయర్ శిరీషా, డాక్టర్ మునిశేఖర్ నుంచి ఎమ్మెల్యే ఆదిమూలం వెండి నాగాభరణం, త్రిశూలం, డమరకం, దీపాలు, హారం, అభిషేక సామాన్లు స్వీకరించి స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, శ్రీనివాసులు, కోన మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, బాలచంద్ర నాయుడు, చంద్రప్ప నాయుడు, రామ్మూర్తి నాయుడు, కందస్వామి నాయుడు, చంద్రప్ప నాయుడు, విజయ్ కుమార్, భాస్కర్, జయచంద్ర నాయుడు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి దుప్పట్లు, దిండ్లు వితరణ

వరదయ్యపాళెం, జూలై 8: మండలంలో ఓళ్లూరు గ్రామానికి టీడీపీ సర్పంచు సురేష్ వరదయ్యపాళెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దుప్పట్లు, దిండ్లు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కుమార్, సిబ్బంది తులసీరామ్, సుబ్రహ్మణ్యం, కళావతి, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

మహాప్రస్థానం వాహనం వితరణ

పుత్తూరు అర్బన్, జూలై 8: పట్టణానికి చెందిన వేదవ్యాస విద్యాసంస్థలకు చెందిన మనోహర్‌రాజు చారిటబుల్ ట్రస్ట్ వితరణ చేసిన మహాప్రస్థానం వాహనాన్ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రభుత్వాస్పత్రికి సోమవారం అందించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ పేదలు అంతిమ సంస్కారాల కోసం మృతదేహాలను తీసుకువెళ్లేందుకు వీలుగా వాహనాన్ని వితరణగా అందించిన మనోహర్‌రాజు ట్రస్ట్ సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో ఆస్పత్రిలోని వసతులపై చర్చించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో వాహన దాత ఎస్వీ యూనివర్శిటీ పాలకమండలి సభ్యుడు సి.నారాయణబాబు, మాజీ ఎంపీపీలు డీఎన్ ఏలుమలై, గంజి మాధవయ్య, రెడ్డివారి చక్రపాణిరెడ్డి, చినబాబు, గాలి జీవరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతకుమునుపు మంచినీళ్ల బావివీధిలో ఎంఎల్ అసోసియేట్స్‌ను, వేదవ్యాస విద్యానికేతన్ నూతన క్యాంపస్‌ను ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రారంభించారు.

శేష వాహనంపై పరాశరేశ్వరుడు

నారాయణవనం, జూలై 8: మండల కేంద్రమైన నారాయణవనంలో వెలసిన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శేష వాహనంపై ఊరేగారు. వేకువజామున స్వామి అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం వేద మంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో, ప్రత్యేక అభిషేకాలు చేశారు. స్వామివారితో సహా అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం 7గంటలకు చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామిని వివిధ పుష్పాలతో అలంకరించి శేష వాహనంపై అధిరోహించి పురువీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలతో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం: ఒకరి అరెస్ట్



ఎర్రచందనం దుంగలు, నిందితుడితో అటవీశాఖ అధికారులు

పుత్తూరు అర్బన్, జూలై 8: అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న ఎర్రచందనం దుంగలతో పాటు ఒకరిని అరెస్ట్ చేసిన సంఘటన పుత్తూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలో సోమవారం జరిగింది. రేంజ్ ఆఫీసర్ డి.మాధవి కథనం మేరకు... ఆదివారం రాత్రి సదాశివకోనలో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బందికి మల్లేరిమిట్ట వద్ద ఎర్రచందనం అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేస్తున్న వ్యక్తులు తారసపడ్డారు. అందులో ఒకరిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారయ్యారు. 107 కేజీల బరువున్న 14 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని ఆమె వెల్లడించారు. పట్టుబడిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రం, తిరువణ్ణామలై జిల్లా మంచమల్లి గ్రామానికి చెందిన మునస్వామి మాణిక్యంగా గుర్తించామన్నారు. ఇటీవల ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు అటవీశాఖ తరఫున కూంబింగ్‌ను తీవ్రతరం చేసినట్లు ఆమె వెల్లడించారు. కూలీలు, స్మగ్లర్లు ఎవరికీ అనుమానం రాకుండా భక్తుల రూపంలో కాషాయ వస్త్రాలు ధరించి వస్తున్నట్లు గుర్తించామన్నారు. వీరు డీప్ ఫారెస్ట్‌లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని ఎర్రచందనం చెట్లును నరుకుతున్నట్లు వివరించారు. పుత్తూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలో కూంబింగ్‌ను నిరంతరాయంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కూంబింగ్‌లో సెక్షన్ ఆఫీసర్ లోకేష్, బీట్ ఆఫీసర్లు కుమారస్వామి, అఫ్జల్, నాగయ్య, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ శివరాజు, బేస్ క్యాంప్ సిబ్బంది వెంకటేష్, నరేష్, రవి, భోగరాజు, భాను తదితరులు పాల్గొన్నారు.



ఈశ్వరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గాలి భానుప్రకాష్

టీడీపీ నేతకు భానుప్రకాష్ పరామర్శ

వడమాలపేట, జూలై 8: మండలంలోని ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చంద్రమోహన్ రాజు తల్లి ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందారు. సోమవారం కర్మక్రియలు నిర్వహించారు. ఈశ్వరమ్మ చిత్ర పటానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు రమేష్, సురేష్‌లను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దబ్బరాజు, సుకుమార్, రవి, హరిరాజు తదితరులు పాల్గొన్నారు.